


విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 01-10-2019 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 19 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ప్రజలకు సేవ చేసేందుకే

# ప్రభుత్వోద్యోగాలు

- అధికారం చెలాయించడం కోసం కాదు
- కులాలు, మతాలు, పార్టీలు చూడొద్దు
- నియామక ప్రక్రియ నూతనాధ్యాయం
- ప్రతీపేదవాడికీ పారదర్శకంగా పథకాలందాలి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- నియామక పత్రాలు అందజేసిన సీఎం






అమరావతి : 'అధికారం చెలాయించడం కోసం ఉద్యోగం చేయడం లేదు.. సేవ చేయడం కోసమే ఈ ఉద్యోగం చేస్తున్నాం అనే విషయాన్ని ప్రతీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగి గుర్తుపెట్టుకోవాలి. కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలు చూడొద్దు. మీ పని తీరు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది. దేశంలో ఇటువంటి ప్రయోగం ఎవరూ చేసి ఉండరు... మీరంతా కలిసి దీనిని విజయవంతంగా పూర్తి చేస్తారనే నమ్మకం నాకుంది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గ్రామ వాలంటీర్లతో అనుసంధానమై ప్రతీ పేదవాడికి పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు చేరేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను అక్టోబర్ 2వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తరువాయి 2లో..

## చెప్పింది చేసి చూపిస్తున్నారు

### సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేయండి

### రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి



విజయనగరం: అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా గ్రామ సచివాలయ నియామకాలు చేపట్టామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి అన్నారు. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు పుష్ప శ్రీవాణి నియామక పత్రాలను అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాలకు ఎంపికైనవారికి అభినందనలు తెలిపారు. నూతనంగా ఎంపికైన ఉద్యోగులు ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించాలని కోరారు. దేశంలో మరెక్కడా తరువాయి 2లో..

## శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన

### - సీఎం జగన్



వార్త 2వ పేజీలో..

## గ్రామ స్వరాజ్యం దిశగా జగన్ పాలన

కర్నూలు : నూతన సచివాలయ ఉద్యోగాలకు ఎంపికైన ఉద్యోగులకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందనలు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలకు జిల్లా నుంచి ఎంపికైన అభ్యర్థులకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, జిల్లా ఎమ్మెల్యేలు నియామక పత్రాలను అందజేశారు. జిల్లా పరిషత్ కార్యలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగుల నియామకాల్లో కర్నూలు జిల్లా నంబర్ వన్‌గా నిలిచిందని, విధుల నిర్వహణలో కూడా నంబర్ వన్‌గా నిలవాలని సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలన తరువాయి 2లో..




## తిరుమలలో 'మీడియా సెంటర్' ప్రారంభం



తిరుమల : వీఐపీ బ్రేక్ దర్శనంలో మార్పులు చేయడంతో సామాన్య భక్తులకు స్వామివారిని దర్శించుకునేందుకు అదనంగా గంటన్నర సమయం లభించిందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఆయన తిరుమలలో 'మీడియా సెంటర్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు మీడియా ద్వారా అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతిని నిర్మూలిస్తే.. తాము టీటీడీలో అధికారుల సహాయంతో అవినీతిని నిర్మూలిస్తున్నామని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో వచ్చే భక్తులకు ఆహారం, నీరు అందించడంలో ఎటువంటి లోటు లేకుండా చూస్తామని తెలిపారు. టీటీడీలో ఎక్కడ కూడా లోపాలు లేకుండా తన వంతు క ృషి చేస్తానని పేర్కొన్నారు.

## 'లక్షల ఉద్యోగాలిచ్చి రికార్డు సృష్టించారు'

### జల వనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్



నెల్లూరు: రాష్ట్రంలో మూడు నెలల్లోనే లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జల వనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ జగన్ కేబినెట్‌లో మంత్రిగా ఉండటం గర్వంగా ఉందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వడం పట్ల కొంతమంది ఓర్వలేక సచివాలయ ఉద్యోగ నియామక పరీక్షలపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ నాలుగు లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. సచివాలయ, వార్డు ఉద్యోగులు నిజాయతీగా బాధ్యతలు నిర్వర్తించి ప్రజలకు సేవాలందించాలని కోరారు. చంద్రబాబు.. నిరుద్యోగులను పట్టించుకోకుండా కేవలం తన కుమారుడికి మాత్రమే ఉద్యోగం ఇచ్చుకున్నారని.. వైఎస్ జగన్ మాత్రం నిరుద్యోగులకు లక్షల ఉద్యోగాలు ఇచ్చి చరిత్ర స ృష్టించారని పేర్కొన్నారు.

## యువతే దేశ సంపద

- లక్ష 26 వేల ఉద్యోగాలతో గ్రామ స్వరాజ్యం
- పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం: 3 మాసాల్లో 80 శాతం వాగ్దానాలను అమలు చేసిన తొలి ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారని పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీచ్ రోడ్డులో గల ఏయు కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి వారిని, వారి శక్తిని రాష్ట్ర దేశ ప్రజా సేవకు ఉపయోగ పరిచే క్రమంలో ముఖ్యమంత్రి ముందుగా సచివాలయ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం చారిత్రాత్మక, నిజమైన ఫలవంతమైన పారదర్శకమైన ప్రజాస్వామ్య ప్రభుత్వమని చెప్పారు. వయస్సు అనుభవం కంటే సేవ చేయాలనే మనసు ఆశయం ముఖ్యం అని ఆయన నిరూపించారు అన్నారు. సమాజంలో అంతరాలు తగ్గించి సమసమాజ నిర్మాణానికి యువత తరువాయి 2లో..



# అన్నపూర్ణ దేవి అలంకారంలో రత్నగిరి దేవతలు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో క్షేత్ర రక్షకులుగా ఉన్న శ్రీ వనదుర్గ, కనక దుర్గమ్మ అమ్మవార్లు దసరా మహొత్సవాలలో భాగంగా సోమవారం అన్నపూర్ణదేవి అలంకారములో భక్తులకు దర్శనము ఇచ్చారు. భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లను దర్శించారు.



గ్రామ సచివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంకు కాశీపట్నంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఓ కుమార్, ఎపిడి భాగ్యరావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి రామస్వామి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సూత్రాలను పాటిద్దాం

- రోగాలను తరిమికొడదాం
- వేచలం వైద్యాధికారిణి హారిక

దేవరాపల్లి : ప్రతి మనిషి ఆరోగ్య సూత్రాలను పాటించడం వలన రోగాల బారిన పడకుండా జాగ్రత్త వహించ వచ్చని ఇందు కోసం ఆరోగ్య సూత్రాలను తప్పక పాటించాలని మండలంలోని వేచలం పిహెచ్సి వైద్యాధికారిణి బి. హారిక అన్నారు. సోమవారం మండలంలోని బోయిలకింతాడ గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో పందికి జ్వరాలు గుర్తించి మందులు అందజేశారు. అలాగే మరో ఐదు మందికి మెడికల్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ పి హెచ్ వో శంకర్రావు, ఏఎన్ఎం లు కే. మరియమ్మ రమాదేవి హెల్త్ అసిస్టెంట్లు కుమార్, ఆశా వర్కర్లు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డయల్ యువర్ కమిషనర్‌కు 14 ఫిర్యాదులు

విశాఖపట్నం : జివియంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 14 ఫిర్యాదులు అందాయి. జివియంసి ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వై.మంగపతిరావు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి 3, మూడవ జోన్‌కు సంబంధించి 3, నాలుగవ జోన్‌కు సంబంధించి 3, ఆరవ జోన్‌కు సంబంధించి 3, అనకాపల్లి జోన్‌కు సంబంధించి ఒకటి, డిప్యూటి ఎడ్యూకేషన్ విభాగంకు సంబంధించి ఒకటి ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

# కల్నల్ ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన



భీమునిపట్నం: స్థానిక ఎస్.వి.ఎల్.ఎన్.ఎస్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కల్నల్ పదమూడవ ఆంధ్రా బెటాలిన్ ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ , డి.వి.ఎల్.ఎన్.ఎస్ ఎస్.రాజు ,టీచర్ కమాండర్ భగవాన్ రావులు సోమవారం కళాశాలను సందర్శించారు.అలాగే ఎన్ ఎస్ ఎస్ పెరేడ్ ను తిలకించి విద్యార్థులను అభినందించి ఎన్ ఎస్ ఎస్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులకు ఎన్ ఎస్ ఎస్ వలన క్రమశిక్షణ తో పాటు జీవన నైపుణ్యాలు అందుతాయని విద్యార్థుల భవిష్యత్తుకు ఉపకరిస్తూ పోటీ పరిక్షలలో విజయం సాధిచండానికి దోహదపడుతుందని తెలిపారు.

ఈ సమా వేశం కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ టి.గ్లోరీ దయా కుమారి అధ్యక్షతన జరిగింది. ఇందులో కళాశాల అధ్యా పకులు నాగపుష్పవల్లి, అప్పలనాయుడు, డాక్టర్ జి.నాగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీఓ కార్యాలయ స్పందనలో 22 అర్జీలు



నర్సీపట్నం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో భాగంగా స్పందన కు సోమవారం 22 అర్జీలు వచ్చాయి. ఆర్ డి ఓ కార్యాలయ ఇంచార్జ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సూర్యనారాయణ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు నాతవరం మండలం ఎం.చెన్నవరం గ్రామా నికి చెందిన ఏటి కుశల తన ధరఖాస్తు లో తాను రెల్లి కులానికి చెందిన వాడినని చిన్న చిన్న వ్యాపారం చేసుకునేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణ సహాయం అందించాల్సిందిగా గ్రామానికి చెందిన పిక్కి రామారావు తన దరఖాస్తులో సర్వేనెంబర్ 240 లో 87 సెంట్ల భూమి ఉందని దానిలో కొబ్బరి, జీడి మొక్కలను వేసుకొని సాగు చేసుకుంటున్నానని గతంలో భూసేకరణ లో భూమిని ప్రభుత్వం తీసుకున్నదని, నేటి వరకు పరిహారం అందలేదని కాబట్టి పరిహారం అందించాల్సిందిగా కోరారు. రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన సతీష్ తన దరఖాస్తులో సర్వేనెంబర్ నలభై లో నాలుగు ఎకరాల భూమి ఉందని, దాన్ని ఆన్లైన్లో నమోదు చేయాల్సిందిగా కోరారు. నాతవరం మండలం వల సన్ పేట గ్రామానికి చెందిన శెట్టి రాంబాబు తన దరఖాస్తులో సర్వే నెంబర్ 10 లో 1.05 సెంట్ల భూమి ఉన్నదని దాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందిగా కోరారు.

నాతవరం మండలం వెన్నెల స్పందన కార్యక్రమానికి డివిజనల్ పంచాయతీ అధికారి శిరీష రాణి, సిడిపిఓ రమణి, గృహ నిర్మాణ శాఖ మరియు ఇతర డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు

# కరువుభత్యం ప్రభుత్వం అందజేయాలి



దేవరాపల్లి : మండలంలోని ఎం అలమండ శ్రీ గౌరీ శంకర భవన నిర్మాణ కార్మిక సంఘం అలాగే తెనుగుపూడి సంపత్ వినాయక భవన నిర్మాణ కార్మికుల సంఘం సభ్యులు నూతన ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి నేటికీ సుమారు మూడు నెలల 20 రోజులు కావస్తున్న భవన నిర్మాణ కార్మికులకు ఇసక సరఫరా లేకపోవడం వలన పనులు లేక కుటుంబాన్ని పోషించుకుంటూ నానా కష్టాలు పడవలసి వస్తుందని మా ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి మాకు కరువు భత్యం ప్రకటించాలి అంటూ సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఈ భవన నిర్మాణ కార్మికుల తమ పరిస్థితులను ప్రభుత్వానికి విన్నవించారు అంటూ స్పందన దరఖాస్తులు చేశారు. ఈ విషయమై స్పందించిన తాసిల్దార్ జె. రమేష్ బాబు, మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సమస్యని తప్పకుండా జిల్లా స్థాయి అధికారులకు పంపుతామని తెలిపారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యల నుంచి 17 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ కమిషనర్‌కు టీడీపీ నాయకులు వినతి పత్రం



భీమునిపట్నం: భీమిలి డివిజన్ టిడిపి అధ్యక్షుడు గంటా. నూకరాజు ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా భీమిలి జోనల్ కమీషనర్ సి.హెచ్. గోవిందరావు కి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ భీమిలి డివిజన్ లో ఉన్న సామాజిక భవనాలు, కళ్యాణ మండపాలను గ్రామ సచివాలయ కార్యాలయాలకు ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా మొత్తం సామాజిక భవనాలన్నిటిని మీ ఆధీనంలో ఉన్నాయని గ్రామంలో ఉండే సామాజిక భవనాలు ఆ గ్రామస్తులు వారి అవసరాల కను గుణంగా ఉపయోగిస్తుంటారు. గ్రామంలో ఏదయినా వివాహం గాని, పుట్టినరోజు కార్యక్రమాలు గాని, గ్రామ ంలో కుల సమావేశాలు ఏర్పాటు చేయుటకు ఉపయోగిస్తుంటారు. బోయవీధి, ఎగువపేట మరియు తోటవీధి లాంటి స్లమ్ ఏరియాలో ఈ యొక్క సామాజిక భవనాలు చాలావరకు గ్రామస్తులకు మంచి ఉపయోగకరంగా ఉంటాయని, బోయవీధి సామాజిక భవనంలో ఇంతకు పూర్వము గ్రంధాలయం నిర్వహించే వారని , హుధుద్ తుపాన్ కి మొత్తం పాడైన తరువాత అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు కొత్త భవనానికి నిధులు మంజూరు చేసి కొత్త భవనం కట్టడమైనది. దీనిని మరలా బోయవీధి గ్రామస్తులకు ఇస్తామని చెప్పా రని. అందువలన దయచేసి ఈ యొక్క సామాజిక భవనాలను ఆ గ్రామస్తులకు ఇప్పించాలని కోరారు. అలాగే భీమిలిలో ఉన్న పాత సబ్ జైల్ స్థలం మొత్తం మొక్కలు మొలిచి చుట్టుపక్కల ఇళ్లలో పాములు వస్తున్నాయని ఈ యొక్క స్థలంని పేదల గృహ అవసరాలకు ఉపయోగిం చడం లేదా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసినట్లయితే ప్రజలకు ఉపయోగ కరంగా ఉంటుందని గంటా నూకరాజు తెలియజేసారు. నెహ్రూ స్కూల్ దగ్గర ఉన్న పెద్దచెట్టు కూలి పోయే ప్రమాదం ఉంది, దీనిపై చర్య తీసు కోవాలని గంటా నూకరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, సంజీవకుమార్, కనకల అప్పల నాయుడు, శ్రీనివాసరావు, కామేష్, కొక్కిరి అప్పన్న, కె.ఎస్.ఆర్.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# వందరోజుల కాల వ్యవధిలోనే ఉద్యోగాలు కల్పించడం ఆనందంగా ఉంది

**నర్సీపట్నం శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్ వెల్లడి**



నర్సీపట్నం : నిరుద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తను ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వందరోజుల కాలంలోనే జిల్లాలో వేయి కంటే ఎక్కువ పోస్టులు మంజూరు చేయడం వాటిని అమలు చేయడం భర్తీ చేయడం ఆనందించదగిన విషయం అని నర్సీ పట్నం శాసనసభ్యులు ఉమాశంకర్ గణేష్ విలేకరులకు తెలి పారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరును ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. సామాన్య ప్రజల బాగోగులు వారి సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుం దన్నారు. నర్సీపట్నం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల నియామక పత్రాలు ఉత్త ర్వులు పంపిణీ లో నర్సీపట్నం శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర గణేష్ మరియు మంత్రి వర్యులు అవంతి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ వినయ్ చంద్ నర్సీపట్నం ఆర్డీవో గోవిందరావు పాల్గొన్నారన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రజలకు సేవ చేసేందుకే ప్రభుత్వోద్యోగాలు

ప్రారంభించబోతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ రాతపరీక్షల్లో అర్హత సాధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తై ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆయన సోమవారం నియామక పత్రాలు అందజేశారు. విజయవాడలోని ఏప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి సీఎం జగన్ సహా మంత్రులు కొడాలి నాని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్ని నాని, బొత్స సత్యనారాయణ, తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు పొందిన చెల్లెమ్మలు, తమ్ముళ్లకు అందరికీ హ ృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'రాష్ట్ర చరిత్రలోనే కాకుండా బహుశా దేశ చరిత్రలో కూడా అత్యంత తక్కువ సమయంలో.. అత్యంత పారదర్శకంగా ఏకంగా ఇరవై లక్షల మందికి పైగా ఉద్యోగాల కోసం పరీక్షలు రాయడం, ఎనిమిది రోజుల పాటు పరీక్షలు జరగడం, లక్షా నలభై వేల మందికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు రావడం.. ఇది నిజంగా ఓ రికార్డు. దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయం. ప్రతీ రెండు వేల జనాభాకు సచివాలయం పెట్టడం.. తద్వారా పది నుంచి పన్నెండు ఉద్యోగాలు ఇవ్వడం అంటే ఉజ్జాయింపుగా ప్రతీ గ్రామానికి పది నుంచి పన్నెండు ఉద్యోగాలు ఇవ్వగలిగామని సగర్వంగా చెబుతున్నా. ప్రతీ యాభై ఇళ్లకు ఒక వాలంటీర్ ఉద్యోగం కూడా ఇచ్చాము. ఉద్యోగాల చరిత్రలో ఇదో సరికొత్త రికార్డు' అని పేర్కొన్నారు.

సొంత ప్రజల రుణం తీర్చుకోండి..

'అమెరికా వెళ్లినా సొంత గడ్డకు ఏదో చేయాలని ఎంతో మంది తపన పడతారు. అలాంటిది సొంత మండలంలోనే ఉద్యోగం చేసే భాగ్యం మీకు దక్కింది. మీ ప్రాంత ప్రజల రుణం తీర్చుకోండి. లంచాలు, వివక్షలేని పారదర్శక పాలన అందివ్వండి. వాలంటీర్లు, మీరు కలిసి పేదవాడి ముఖంలో ఆనందం తీసుకురండి. మనం అధికారం చెలాయించడానికి కాదు.. వారికి సేవ చేయడానికి ఉన్నాం. గ్రామాల్లో రేషన్ కార్డు నుంచి ఏది కావాలన్నా లంచం తీసుకునే పరిస్థితి ఉండేది. జన్మభూమి కమిటీలు వ్యవస్థను నాశనం చేశాయి. వాటి కారణంగా నేడు గ్రామాల్లో పాలనా వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉంది. అటువంటి పరిస్థితులను మన వ్యవస్థ ద్వారా మెరుగుపరచాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో 34 పనులు జరుగుతాయి. 72 గంటల్లోనే వారికి పరిష్కార మార్గం చూపేలా చర్యలు ఉంటాయి. మీరు చేసే సేవతో ప్రజల ముఖాల్లో వచ్చే చిరునవ్వును ఊహించుకోండి. ప్రతీ గ్రామ వాలంటీరుకు ఒక స్మార్ట్ ఫోన్ ఇస్తారు. జనవరి 1 నుంచి పూర్తిగా 500 సేవలు అందుబాటులోకి వస్తాయి. అదే విధంగా జనవరి 1 నుంచి కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు వస్తాయి. అర్హత ఉన్నవారికి తప్పకుండా లబ్ధి చేకూరాలి' అని సీఎం జగన్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నిర్దేశం చేశారు. అదే విధంగా ఇంత కష్టపడి నియామక ప్రక్రియ నిర్వహించిన ప్రతీ ఒక్క అధికారికి నా సెల్యూట్ అని అధికారులను ప్రశంసించారు.

## యువతే దేశ సంపద

కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ధనము పదవిపై వ్యామోహం లేదని ప్రజాసేవ ఆయనకు ఆనందం కలిగించే అంశమని చెప్పారు. నాయకుడంటే జగనేనని నిరూపించారని అన్నారు. దేశంలో 60 శాతం ఉన్న యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని, దేశం నీకేమిచ్చింది అనేకన్నా దేశానికి నువ్వేమి ఇచ్చావన్నది కాదన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని సాధించవలసింది ఇంకా ఉన్నదన్నారు. వి ఎం ఆర్ డి ఎ అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్రంలో కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు అన్ని రాష్ట్రాలకు ఆదర్శవంతమైన సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నిజం చేసేందుకు పూనుకున్నారు అన్నారు. రాష్ట్ర శాసనసభ విప్ బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా సచివాలయ ఉద్యోగులు పని చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల గౌరవాన్ని నిలబెడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఉద్యోగాలు పొందిన మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామానికి చెందిన కిల్లాడి అనురాధ, నాతవరం మండలం సరుగుడు గ్రామానికి చెందిన కుర్రా కిరణ్ కుమార్, అనకాపల్లికి చెందిన సి ఎస్ కుమార్ దేవరపల్లి కి చెందిన దివ్యాంగుడు ఎస్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ మాట్లాడుతూ పురపాలక గ్రామపంచాయతీలను బలోపేతం చేయడం ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని దానికి అనుగుణంగా 19 రకాల ఉద్యోగాలకు జూలై 26న నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు జిల్లాలో 807 గ్రామ, వార్డు సెక్రటేరియట్ లలో 10, 873 పోస్టులకు 406 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు.7, 724 అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలువగా 62 43 మంది హాజరయ్యారు అన్నారు. వారిలో 4362 మందిని ఎంపిక చేయడం జరిగిందని వివరించారు వీరు అక్టోబరు 1వ తేదీన సంబంధిత శాఖలలో రిపోర్టు చేసినట్లయితే కౌన్సెలింగ్ ఇస్తారని అనంతరం రెండవ తేదీన 7 గంటల నుండి విధులలో చేరవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతి శాసనసభ్యులు కరణంధర్మశ్రీ, గొల్ల బాబురావు తిప్పల నాగిరెడ్డి అన్నం రెడ్డి అదీప్ రాజు గుడివాడ అమర్నాథ్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పెట్ల ఉమాశంకర్ గణేష్, జీవీఎంసీ కమిషనర్ డా జి సృజన జాయింట్ కలెక్టర్ ఎల్. శివ శంకర్, జె సి 2 సూర్య కళ నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.సంపద యువతే,

## చెప్పింది చేసి చూపిస్తున్నారు

లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. పాదయాత్ర సమయంలో చెప్పిన విషయాలను ఇప్పుడు చేసి చూపిస్తున్నారని తెలిపారు. మహిళలకు యాభై శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అన్నింటా అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించుకున్నవారిపైన ప్రతిపక్ష నేత చంద్రబాబు అవాక్కులు చవాక్కులు విసిరారని విమర్శించారు. పేపర్ లీక్ అంటూ అసత్య ప్రచారాలు చేపట్టారని మండిపడ్డారు.

## గ్రామ స్వరాజ్యం దిశగా జగన్ పాలన

దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చారని కొనియాడారు. ఈ వ్యవస్థను అక్టోబర్ 2 నుండి ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో 1.27 లక్షల కొత్త ఉద్యోగాలు కల్పించబోతున్నట్లు బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. రాష్టంలో 1.27 లక్షల ఉద్యోగాలకు 20 లక్షలమంది పరీక్షలు రాశారని, లక్షమంది ఉద్యోగాల్లో చేరబోతున్నారని మంత్రి అన్నారు. కర్నూలు జిల్లాలో 9597 ఉద్యోగాలకు సోమవారం 5492 మందికి నియామక పత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజల ఆదరణతో సీఎం అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం నవరత్నాలు పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాలు, వార్డుల్లో లక్షల్లో ఉద్యోగాలు నిజాయితీగా, అవినీతి రహితంగా కల్పించారని ప్రశంసించారు. ఒక సెంటు భూమి కూడా తేడా రాకుండా సీఎం జగన్ చర్యలు చేపట్టారని తెలిపారు. 60 సంవత్సరాలు ఉమ్మడిగా ఉన్న రాష్ట్రం అందరూ వద్దు అనుకున్నా పునర్విభజన జరిగిందని, ఐటీ, సేవారంగం ఆదాయం అంతా తెలంగాణ రాష్ట్రానికి పోయిందని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ పాలకులు అప్పులు చేసి, బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను పెండింగ్ పెట్టి పోయారని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ విమర్శించారు.

# శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం జగన్

## వైఎస్సార్ కుటుంబానికి అరుదైన రికార్డు

తిరుమల : తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీవారి ఆలయం ముందున్న బేడి ఆంజనేయస్వామి ఆలయం నుంచి తలపై స్వామివారి శేషవస్త్రంతో పరివట్టం కట్టుకుని మేళతాళాల మధ్య శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్లారు.

ఆలయ మహాద్వారం ద్వారా ఆలయంలో ప్రవేశించిన సీఎం వైఎస్ జగన్.. గర్భాలయంలో మూలవిరాట్టు ముందు అర్చకులకి, అధికారులకు పట్టువస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి శంకర్ నారాయణ పాల్గొన్నారు.

అనంతరం సీఎం వైఎస్ జగన్ పెద్ద శేషవాహన సేవలో పాల్గొని ఉత్సవమూర్తిని దర్శించుకోనున్నారు. అంతకు ముందు ధ్వజారోహణం కార్యక్రమంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి.

సీఎం వైఎస్ జగన్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడంతో.. టీటీడీ చరిత్రలో వైఎస్సార్ కుటుంబానికి అరుదైన గౌరవం దక్కినట్టయింది. ఒకే కుటుంబంలో తండ్రి, తనయుడు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఘనత వైఎస్ కుటుంబానికి దక్కింది. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ రాజశేఖర రెడ్డి అనేక పర్యాయాలు బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలేశునికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ ఏడాది అదే ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్ర ప్రభుత్వం తరపున వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

# వాల్తేరు డివిజన్‌ను కొనసాగించాలి

- గ్రామీణ జర్నలిస్టులకు రైల్వే పాసులు మంజూరు చేయండి
- ఆదాయము కాదు.. అభివృద్ధి లక్ష్యం..
- కేంద్ర రైల్వేమంత్రి పియూష్ గోయల్,
- రైల్వే బోర్డు ఛైర్మన్‌లకు విజేఎఫ్ వినతి



విశాఖపట్నం : పురాతనమైన, చారిత్రాత్మకమైన వాల్తేర్ డివిజన్‌ను యధాతధంగా కొనసాగించాలని డివిజన్‌తో కూడిన సౌత్‌ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌గా పరిగణించాలని కేంద్ర రైల్వేమంత్రి పీయూష్ గోయల్‌ను వైజాగ్ జర్నలిస్ట్ ఫోరంకోరింది. సోమవారం డిల్లీలోని రైల్వే భవన్‌లో కేంద్రమంత్రిని వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు కల్సి ఈ మేరకు అవసరమైన వినతిపత్రాలు అందజేశారు. 1052 కీమీ లైనులు వైశాల్యం గల వాల్తేర్ డివిజన్ ద్వారా ప్రతి ఏడాది ప్రజా, సరకు రవాణాతోపాటు వేర్వేరు మార్గాల ద్వారా సుమారు 20 వేల కోట్ల ఆదాయం లభిస్తుందని శ్రీనుబాబు మంత్రికి వివరించారు. విజెఎఫ్ వినతి పై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి మాట్లాడుతూ కేంద్రం ఆదాయం కోసం చూసుకోవడం లేదన్నారు. ముందుగా ఆయా ప్రాంతాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ వ్యవహారంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు రైల్వే పాస్‌లు మంజూరు చేయాలని మంత్రిని కోరగా ఈఅంశంపై అవసరమైన చర్యలు చేపడుతామన్నారు. సంబంధిత రైల్వే అధికారులతో చర్చించి అవసరమైన అదేశాలు ఇస్తామన్నారు.

**రైల్వే బోర్డు ఛైర్మన్‌కి వినతి**

తదుపరి రైల్వే బోర్డు ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ ను కలసి విజెఎఫ్ వినతిపత్రం సమర్పించింది. ఆ పై కేంద్ర, రైల్వే మంత్రి, ఛైర్మన్‌లను ఘనంగా సత్కరించి సింహాద్రి అప్పన్న చిత్రపటాలను బహుకరించారు. కాకినాడ ఎంపీ వంగా గీతా కూడా జర్నలిస్టుల అంశాలను సానుకూలంగా పరిశీలించాలని కేంద్రమంత్రిని కోరారు. ఆయా కార్యక్రమాల్లో విజెఎఫ్ కార్యవర్గసభ్యుడు ఇరోతి ఈశ్వరరావు, ఇతర ప్రతినిధులు బి. ఈశ్వరరావు, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజాన్ని చైతన్యపరిచేవి కళలు

- ఉత్సాహంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి నాటిక పోటీలు
- హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడటం ప్రతీ ఒక్కరి బాధ్యత
- రాష్ట్రస్థాయి నాటిక పోటీల ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



చోడవరంః దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మండలంలోని జుత్తాడ గ్రామంలోని రామాలయం వద్ద రాష్ట్రస్థాయి నాటిక పోటీలు ఆదివారం రాత్రి నుంచి ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, చోడవరం సి.ఐ, కె.ఈశ్వరరావు, షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ నాయకులు శరగడం రామునాయుడు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి నాటిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళలు ద్వారా సమాజం చైతన్యవంతానికి కళలు దోహదపడతాయని అటువంటి కళలు, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు ఆదరించడం, కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. పనికి మాలిన ప్రోగ్రామ్‌లు కాకుండా జుత్తాడలో రాష్ట్రస్థాయిలో నాటిక పోటీలు పెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం తరపున ఏ సహాయం కావాలన్నా వాటిని నెరవేరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీలా వెంకట గణేష్, రాపేటి త్రినాద్,మళ్ళ శ్రీనువాసరావు, దొడ్డి సన్యాసినాయుడు, దొడ్డి కృష్ణ సత్యనారాయణ,చినప్పడు,కనిశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా నాటిక పోటీలలో భాగంగా మొదటి రోజు ప్రకాశం జిల్లా ,వింజరంపాడు వారిచే ప్రదర్శించిన భూమి దుఃఖ: నాటిక ప్రేక్షకులను అలరించడమే కాకుండా ఎంతగానో ఆలోచింపచేసింది. భూమిని నమ్ముకోవాలేగాని అమ్ముకోకూడదు అనే వృత్తాంతాన్ని నేపధ్యంగా తీసుకుని రచయిత జి.వి.ఆర్. శర్మ కధను ఎంతో ఆసక్తికరంగా మలిచారు. వ్యవసాయం, పనిపాటలేని పెద్ద కుమారుడు భూమిని అమ్ముకోవడమే కాకుండా అడ్డువచ్చిన తల్లిదండ్రులను సైతం అడ్డుతొలగించేందుకు చేసిన ప్రయత్నం, తప్పు చేసిన వాడు చివరకు చట్టం ముందు దోషులుగా నిలబడక తప్పదు అనే కధాంశాన్ని సుందరయ్య, భూదేవమ్మ, రాజంకోడు, శివయ్య పాత్రదారులు తమ నటనతో ఆకట్టుకోగా, చిచ్చుబుడ్డి పాత్రధారి తన హాస్యంతో ప్రేక్షకులను అలరించారు.నాటిక పోటీలకు న్యాయనిర్ణేతగా శ్రీకాకుళం జిల్లా, రాజాం కళాక్రియేషన్సు శెక్రటరీ జి.కృష్ణమూర్తి వ్యవహరించారు.


**ఉత్తర రైల్వే**

**ఇ- టెండరు ప్రకటన**

డిప్యూటీ. చీఫ్ ఇంజనీర్/నిర్మాణం-V/ఉత్తర రైల్వే, లక్నో కొరకు వారు భారత రాష్ట్రపతి తరపున తరపున, ఇద్దరు ప్యాకెట్ల వ్యవస్థలో ఓపెన్ ఇ-టెండరును ఆహ్వానించారు.

| | | |
|---|---|---|
| 1 | పనిపేరు | ఉత్తర రైల్వేలోని లక్నో డివిజన్‌కు చెందిన "జంఘై - ప్రతాప్‌ఘర్ - అమేతి (87 కి.మీ) యొక్క ప్రతిపాదిత రెట్టింపు జంఘై యార్డ్-కట్టిఫిల్లింగ్, ఎఫ్‌ఓబి, ప్లాట్‌ఫాం ఆశ్రయం, చిన్న వంతెనల విస్తరణ, యార్డ్ డ్రెయిన్లు, స్టేషన్ భవనం, ఆర్ఆర్ఐ భవనం, పరిమిత ఎత్తు సబేవే మరియు ఇతర అనుబంధ పనులలో వివిధ పౌర పనుల అమలు. |
| 2 | పని పూర్తి కాలం | 12 (పన్నెండు) నెలలు |
| 3 | పని అంచనా విలువ | రూ. 1678.42 లక్షలు |
| 4 | జమచేసిన ధరావత్తు సొమ్ము | రూ. 989300.00 |
| 5 | ఇ- టెండరు తెరచు మరియు టెండరు అప్‌లోడింగ్ కొరకు తేది మరియు సమయం | టెండర్లను 11.30 గంటలకు అప్లోడ్ చేయవచ్చు. 25.10.2019 తేదీన ఆర్ఇపిఎస్ వెబ్‌సైటు అంటే www.ireps.gov.in ఈ టెండర్లో వేలం వేయవచ్చు. 25.10.2019 తేదీలలో 11.30 గంటలకు టెండర్లను అప్లోడ్ చేయడంతో వెంటనే టెక్నికల్ కమర్షియల్ బిడ్ తెరవబడుతుంది. |
| 6 | టెండరు డాక్యుమెంటు & టెండరు ప్రకటన వివరాలు | వివరణాత్మక ఈ-టెండర్ నోటీసు నార్తరన్ రైల్వే వెబ్ సైట్ www.nr.indian-railways.gov.in లో లభిస్తుంది 04.10.2019న అంటే www.ireps.gov.in పైన ఇచ్చిన ప్రతిపాదనకు రెండిటి పత్రం అందుబాటులో ఉంటుంది ఆర్ఇపిఎస్ వెబ్సైట్ అంటే www.ireps.gov.in నుండి 10.10.2019 నుండి 25.10.2019 వరకు . పైన పేర్కొన్న అన్ని ఇతర నిబంధనలు, టెండర్ పత్రాల్లో ఇవ్వబడతాయి. ఎగువ ఆఫీసు యొక్క నోటీసు బోర్డులో వివరణాత్మక టెండర్ నోటీసు సిపిఎమ్/ఎన్ఆర్/లక్నో ఆఫీసులో కూడా చూడవచ్చు. |

నెం. 4-టెండరు/డిప్యూటి. సిఇ/సి-V/ఎల్‌కెఓ తేది: 30.09.2019 **3158/2019**

**వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు**


## జర్నలిస్టు బాబూదేవ్‌పై దాడి చేసిన దుండగులను

# వెంటనే అరెస్టు చేయాలి

విశాఖ క్రైంః సీనియర్ జర్నలిస్టు బాబూదేవ్ (బి.వి.ఎస్. దేవ్)పై దాడి చేసిన దుండగులను తక్షణం అరెస్టు చేయాలని అఖిల పక్ష జర్నలిస్టు యూనియన్లు డిమాండ్ చేశాయి. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, జాప్, ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్, క్రైమ్ రిపోర్టర్స్ అసోసియేషన్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్లు సంయుక్తంగా సోమవారం పోలీస్ కమిషనర్ ఆర్.కె.మీనాను కలిసి సంఘటన వివరాలను తెలియజేసి వినతిపత్రం సమర్పించాయి. మద్దిలపాలెం బజారు సమీపంలో సెప్టెంబరు 27వ తేదీ మధ్యాహ్నం సమయంలో దుండగులు బాబూదేవ్‌ను పిడిగుద్దులతో గుద్దారని వెంటనే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా స్థానికులు కేజీహెచ్‌లో చేర్చినట్లు తెలిపారు.

# బాలా త్రిపుర సుందరి అలంకరణలో కనకదుర్గాదేవి



చోడవరంః దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చోడవరం పాతబస్టాండ్ ఆవరణలోని కనకదుర్గాదేవి అమ్మవారు రెండవ రోజు సోమవారం శ్రీ బాలా త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీసూక్తసహితంగా పూజలు నిర్వహించి హోమ పూజ నిర్వహించారు.

అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించారు.

# ఘనంగా సచివాలయ అభ్యర్థులకు నియామక పత్రాలు జారి



శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేసారు. శ్రీకాకుళం పట్టణంలో ఆనందమయి ఫంక్షన్ హాల్ లో సోమ వారం జరిగిన కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణ దాస్ ముఖ్య అతిథిగాహాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగీత ఉపాధ్యాయులు ప్రశాంతి ప్రార్ధనా గీతాన్ని ఆలాపించారు. జిల్లాలో 835 గ్రామ, వార్డు సచివాలయాల పోస్టులకు 1,14,734 మంది పరీక్షలు వ్రాసిన సంగతి తెలిసిందే.

నియామక పత్రాల జారీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి కృష్ణదాస్ మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా నియామక ప్రక్రియ జరిగిందన్నారు. యువత కలలను సీఎం సాకారం చేశారని పేర్కొన్నారు. అందుకే ప్రత్యేక హోదా కోసం ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే కేటాయించాలని చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేయాలని నూతన ఉద్యోగార్థులను కోరారు. ప్రభుత్వం అప్పగించిన పనులను చక్కగా నిర్వర్తించి ప్రజల మన్ననలను పొందడమే కాకుండా ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఉద్యోగానికి సార్ధకత చేకూర్చాలని పిలుపునిచ్చారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించాలని పిలుపునిచ్చారు.

జాయింట్ కలెక్టర్ డా కె శ్రీనివాసులు భారీ ప్రక్రియను సజావుగా పూర్తి చేసామన్నారు. ఇంతటి భారీ నియామక ప్రక్రియలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు రేష్మా, శ్రీవాణి, తేజేశ్వరి, ఎస్.సుశీల, సీపాన గోవిందరావు, ఏ.భవాని, కే.అప్పన్న, రవళి ప్రియ, హరిత తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూసిన ప్రభుత్వ ఉద్యోగం సాకారం అయిందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను మంత్రి, జాయింట్ కలెక్టర్ అందజేసారు.

ఈ సందర్భంగా విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉద్యోగం ఉద్యోగంగా కాకుండా ఉద్యమంలా సేవలు అందించాలని పిలుపునిచ్చారు. సొంత మండలంలో ఉద్యోగం చేసే గొప్ప అవకాశం పొందినందుకు అంకితభావంతో పనిచేయాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నిజాయితీతో, నిష్పక్షపాతంగా పారదర్శకంగా సేవలు అందించాలని పిలుపునిచ్చారు. వాలంటీర్లతో అనుసంధానం అవుతూ ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రతి గడపకు చేర్చాలని చెప్పారు. 2000 మందికి ఒక సచివాలయం, 50 కుటుంబాలకు ఒక వాలంటీర్ ను ఏర్పాటు చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వి.రమణ, జెడ్పీ సిఇఓ జి.చక్రధర రావు, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.గీతా దేవి, డిపిఓ వి.రవికుమార్, డిఆర్డిఏ పిడి ఏ.కళ్యాణ చక్రవర్తి, వ్యవసాయ శాఖ జెడి బిజిడి ప్రసాద్, మత్స్య శాఖ జెడి డా వివి కృష్ణ మూర్తి, పశుసంవర్ధక శాఖ జెడి డా.ఏ.ఈశ్వర రావు, పంచాయతీరాజ్ ఎస్.ఇ ఎస్.రామ్మోహన్, ఉద్యానవన శాఖ ఏడి ఆర్వివి ప్రసాద్, మునిసిపల్ పూర్వ అధ్యక్షులు వరం, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు గొండు కృష్ణ మూర్తి., వెంకట చిరంజీవి నాగ్ తదితరులు పాల్గొన్నారు.

# జననివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

**జేసీకి వినతిపత్రం సమర్పించిన మురళీనగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్**



మురళీనగర్ : గ్రేటర్ విశాఖ మురళీ నగర్‌లోగల బ్యాంక్ స్ట్రీట్‌లో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ మురళీనగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుండి శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నారు.

మద్యం దుకాణం వల్ల ఈ ప్రాంతం కలుషితమౌతుందని, ప్రభుత్వ బ్యాంకులు ఈ ప్రాంతంలో ఉన్నందువల్ల బ్యాంకు ఖాతా దారులు, ప్రజలకు అనేక ఇబ్బందులు కలుగుతాయని సోమవారం జాయింట్ కలెక్టర్ ఎల్. శివశంకర్‌కు వినతిపత్రం సమర్పించారు.

# ఆవార్డు విజేతలకు అభినందన

## ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : జాతీయ సేవా పథకంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన విద్యార్థులను వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన వలంటీర్లు కె.జగదీశ్వరి, బి.మహేంద్ర నాథ్‌లను, రాష్ట్ర స్థాయిలో అవార్డులు సాధించిన వలంటీర్ డి.సాయి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస రావులను అభినందించారు. జాతీయ సేవా పథకం అందిస్తున్న సేవలు వర్సిటీకి మంచి పేరు తెస్తున్నాయన్నారు. అవార్డులు సాధించిన వారు మరింత ఉత్సాహంగా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇతరులకు స్ఫూర్తిని రేకెత్తిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన సాంస్కృతిక సంబరాలు

**గీతం కళాకృతిలో యువజనోత్సాహం**



సాగర్‌నగర్ః గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని వివిధ రాష్ట్రాలు, దేశాల విద్యార్థులు సభ్యులుగా గల కళాకృతి విభాగం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న సాంస్కృతిక ఉత్సవా లలో సోమవారం గీతం బాలయోగి కళా వేదికపై నిర్వహించిన కార్యక్రమాలలో యువజనోత్సాహం అంబరాన్ని తాకింది. వివిధ రాష్ట్రాల విద్యార్థులు వారి సంస్కృతులను ప్రతిభింబించే విధంగా చేసిన ప్రదర్శనలు అకట్టుకున్నాయి, సందేశాత్మకంగా వివిధ అంశాలపై విద్యార్థులు మూకాభినయం, లఘునాటికలు ప్రదర్శించడంతో పాటు భరతనాట్యం, బృందగీతాలు, పాశ్చాత్య సంగీతంతో ఆహుతులను ఉర్రూతలూగించారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ తరహ సాంస్కృతిక ఉత్సవాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గీతంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, వివిధ రాష్ట్రాల సంస్కృతులను పరస్పరం తెలుసుకోవడానికి సాంస్కృతిక ఉత్సవాలు సరైన వేధిక అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గీతం విద్యార్థి వ్యవహరాల విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ కె.వీరభద్రం, వేణుగోపాల్, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ కార్పోరేషన్ భారతి స్కీమ్ దరఖాస్తుకు అక్టోబరు 31 వరకు గడువు పొడిగింపు

చోడవరం : బ్రాహ్మణ కార్పోరేషన్ ద్వారా 2019-20 సంవత్సరానికి భారతి స్కీమ్‌కు గాను ఒకటవ తరగతి నుంచి,పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు చదువుకునే వారు స్కాలర్‌షిప్ ధరఖాస్తు చేసుకునేందుకు అక్టోబరు 31 వరకు గడువు పొడిగించినట్లు ఆంధ్రా బ్రాహ్మణ కార్పోరేషన్, చోడవరం నియోజకవర్గ పూర్వపు సమన్వయకర్త ఉపాధ్యాయులు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ యువత ఈ సదవకాశం వినియోగించుకోవలసిందిగా కోరారు.

# విఎంఆర్డిఏ గ్రీవెన్స్‌కు నాలుగు దరఖాస్తులు

- వారంలోగా తీసుకున్న చర్యలను తెలియజేస్తాం
- విఎంఆర్డిఏ కమిషనర్ పి. కోటేశ్వర రావు



సిరిపురం: ప్రతి సోమవారం విఎంఆర్డిఏ లో నిర్వహించే ఓపెన్ ఫోరం గ్రీవెన్స్ కు ఈ సోమవారం నాలుగు దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తులను కమిషనర్ పి. కొటేశ్వర రావు స్వీకరించారు. అందిన దరఖాస్తుల పై వారం లోగా చర్యలను తెలియజేస్తామని కమిషనర్ దరఖాస్తు దారులతో తెలిపారు.

అందుకున్న దరఖాస్తు లను సంబంధిత విభాగాధి కారులకు అందజేస్తు వారం లోగా సమాధానాలను ఇవ్వాలని సూచించారు. మిధిలాపూరి లే ఔట్ వద్ద సర్వే నెంబర్ 262/281 నందు లే ఔట్ అనుమతి 1994 లో ఇచ్చారని, అందులో 2 ప్లాట్లకు అనుమతి కాలేదని, అదే విధంగా భూ మార్పిడి చేయాలని షిప్ యార్డ్ సొసైటి అధ్యక్షులు పి.వి.రమణ రావు దరఖాస్తు చేశారు. వారం లోగా చర్యలు తీసుకోవాలని చీఫ్ అర్బన్ ప్లానర్ సురేష్ కు సూచించారు. ఆనందపురం మండలం మామిడివలస సర్వే నెంబర్.51 లో శుభగృహ వారు వేసిన లేఔట్ సెటిల్‌మెంట్ వ్యవహారంపై కోర్ట్ లో వేశామని, ఆ లే ఔట్ క్రయ విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు అందజేయగా వారికి వెంటనే నోటిస్ జారీ చేయాలని సూచిం చారు. గోపాలపట్నం బంక్ నుండి సింహాచలం వరకు గల రోడ్ ను 200 అడుగుల మాస్టర్ ప్లాన్ నందు చేర్చరని, ఐతే అందులో సగం రోడ్ వరకు 100 అడుగులు ఉండగా, మిగిలిన దాన్ని 200 అడుగుల మాస్టర్ ప్లాన్‌లో చేర్చడం జరిగిందని, ఇళ్ళు నిర్మించుకోవాలని ప్లాన్ కోసం వెళితే మా స్థలంలో కొంతభాగం జీవీఎంసీకి మార్టగజ్ చేయా లంటున్నారని , 200 అడుగుల మాస్టర్ ప్లాన్ నుండి ఈ రహదారిని తొలగించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ దరఖాస్తును పరిశీలించి 200 అడుగుల రోడ్ అవసరంలేదనుకుంటే మాస్టర్ ప్లాన్ నుండి డీనోటిఫై చేయాలని సి యు.పి సురేశ్ కు సూచించారు. వుడా రోడ్ వేశాక 30 ఏళ్లగా నష్టపరిహారం చెల్లించలేదని, నష్ట పరిహారం కోసం బెహ్రా భాస్కర రావు దరఖాస్తు చేశారు. ఈ గ్రీవెన్స్ నందు సెక్రెటరీ ఏ.శ్రీనివాస్, ఎస్.ఈ రామ్మోహన్ రావు, ఎస్టేట్ అధికారి రాజు, చీఫ్ అక్కౌంట్స్ అధికారి హరిప్రసాద్, పిఓ తదితరులు హాజరైనారు.

# విజయభాను సంపాదకీయం

## దిశానిర్దేశం చేయాలి

బ్రిటన్ పార్లమెంట్ సమావేశాలను కొన్నివారాల పాటు వాయిదా వేస్తూ ప్రధాని బోరిస్ జాన్సన్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయడం ద్వారా ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసింది. లిఖిత రాజ్యాంగం లేనప్పటికీ సమాజంలోని ప్రజాస్వామ్య స్ఫూర్తి, వ్యవస్థల పటిష్టత వల్ల ప్రజాస్వా మ్యం మనగలదని బ్రిటిష్ అనుభవం చాటిచెప్పింది. బ్రిటన్ యురోపియన్ యూనియన్ నుంచి బయటపడటానికి (బ్రెగ్జిట్) చర్చలు సాగుతున్న సంక్లిష్ట దశ ఇది. ఈ విషయంలో ఎంత చర్చిం చినా పరిష్కారం లేదా ఏకాభిప్రాయం సాధ్యం కాని అయోమయం నెలకొన్నది. బ్రెగ్జిట్‌పై పార్లమెం ట్ ఏదో ఒకటి తేల్చడం లేదనేది వాస్తవం. అయినప్పటికీ ఎటుచేసి అంతిమంగా తేల్చవలసింది పార్లమెంట్ మాత్రమే. దేశం ఏదో ఒక నిర్ణయాన్ని తీసుకోవలసిన కీలకమైన దశలో ప్రధాని జాన్సన్ పార్లమెంట్ సమావేశాలను వాయిదా వేయడం సమర్థనీయం కాదు. ప్రజల్లో జాతి దురభిమానాన్ని నూరిపోసి అధికారం చేపడుతున్న నాయకులు పార్లమెంట్‌తో సహా ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం ప్రపంచవ్యాప్తంగా సాగుతున్నది. ప్రజాస్వామ్యాల స్థానంలో క్రమంగా నిరంకుశ రాజ్యాలను నెలకొల్పే పోకడ ఆందోళన కలిగిస్తున్నది. ఇటువంటి సందర్భంలో బ్రిటన్ సుప్రీంకోర్టు పార్లమెంట్ ఔన్నత్యాన్ని చాటిచెప్పడం హర్షించదగినది. పార్లమెంట్ సమావేశాలను వాయిదావేస్తూ ప్రధాని తీసుకున్న నిర్ణయం చెల్లదంటూ సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యానం కూడా ప్రజాస్వామ్య మూలసూత్రాలను బలపరిచేదిగా ఉన్నది. పార్లమెంట్ రాజ్యాంగ కలాపాలు నిర్వహించకుండా అడ్డగించడానికి సమావేశాలను వాయిదా వేయడం చట్టవిరుద్ధం అవుతుందని న్యాయస్థానం స్పష్టంచేసింది. సమావేశాల వాయిదా ప్రభావం తీవ్ర మైనది అయితే అసాధారణమైన రీతిలో న్యాయ స్థానం జోక్యం చేసుకుంటుందని వివరించింది. ఈ విధంగా పార్లమెంట్ ఎప్పుడు సమావేశాలు కావాలె, ఎప్పుడు మూతపడాలనేది ఇష్టారీతిగా నిర్ణయించే అధికారం కార్యనిర్వాహక శాఖకు లేదని సూత్రీకరించింది. పార్లమెంట్ విశ్వాసం పొందడం ద్వారానే ప్రభుత్వం అనేది ఉంటుంది. అంతకుమించి ప్రభుత్వానికి వేరే ప్రజాస్వా మిక అర్హతలేదు. అందువల్ల తాము జవాబుదారీగా ఉండవలసిన పార్లమెంట్‌నే పనిచేయకుండా నిరోధించే అధికారం ప్రధానికి ఉండదు. ఈ విధంగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే శాసన సభ ప్రభుత్వం కన్నా, ప్రధాని కన్నా ఉన్నతమైనదని న్యాయస్థానం స్పష్టంచేసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని వమ్ము చేయడానికి కార్యని ర్వాహక విభాగం ప్రయత్నించినప్పుడు న్యాయ స్థానం తన బాధ్యతగా అడ్డుకుంటుందని సుప్రీం కోర్టు తీర్పుతో స్పష్టమైంది. పార్లమెంట్ పనిచే యవలసిన ఎనిమిది వారాల కాలంలో ఐదు వారాలు నిరోధించడానికి తగిన కారణాలను ప్రధాని చూపలేకపోయారనేది కూడా న్యాయ స్థానం గుర్తించింది. బ్రిటన్ భవిష్యత్తు నిర్ణయ మయ్యే కీలకదశలో పార్లమెంట్ సమావేశాలకు అవరోధాలు కల్పించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. సుప్రీంకోర్టు తీర్పు దీర్ఘకాలికంగా కూడా పార్లమెంట్‌ను తద్వారా ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరుచడానికి దోహదపడుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటే పరమోన్నతమైనదనే విషయంలో భిన్నాభిప్రాయానికి తావు లేదు. ప్రధాని జాన్సన్ చర్య నిరంకుశ పోకడ అనేదీ స్పష్టమే. ఈ విషయంలో న్యాయస్థానం నిర్వహించిన పాత్ర కూడా ప్రశంసనీయమైనదే. కానీ పార్లమెంట్ ఔన్నత్యాన్ని కాపాడవలసిన బాధ్యత అందరికన్నా ఎక్కువగా పార్లమెంట్ సభ్యులపైనే ఉంటుంది. దేశాన్ని నడిపించడంలో ప్రజాప్రతినిధులు విఫలమైతే ఏ న్యాయస్థానమూ పార్లమెంట్‌ను, ప్రజాస్వామ్యాన్ని కాపాడలేదు. పార్లమెంట్ ప్రజల విశ్వాసం కోల్పోకూడదు. నిజానికి ప్రధాని జాన్సన్ పార్లమెంట్‌ను పక్కనపెట్ట డానికి దారితీసిన పరిస్థితులను కూడా ప్రజా ప్రతినిధులే కల్పించారు. దేశ సార్వభౌమత్వానికి, ప్రజాభిప్రాయానికి విలువ లేకుండా పోతున్నదనే కారణంగా బ్రిటిష్ ప్రజలు యురోపియన్ యూనియన్ నుంచి వైదొలుగాలని 2016 జూన్‌లో ప్రజాభిప్రాయ సేకరణలో తీర్పు ఇచ్చారు. అయినా బ్రెగ్జిట్ నిర్ణయం ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఈయూతో ఒప్పందం ముసాయిదాను పార్లమెంట్ మూడుసార్లు తిరస్కరించింది. బ్రెగ్జిట్‌ను (పారిశ్రామిక సంస్థల ఒత్తిడి మూలంగా) నిరోధించే ప్రయత్నాలు సాగుతున్నాయని ప్రజలు అనుమానిస్తున్నారు. ఆగ్రహంతో న్యాయస్థానం తీర్పును కూడా తప్పుపడుతున్నారు. పార్లమెంట్‌పై ప్రజలు ఆగ్రహంగా ఉన్నందు వల్లనే ప్రధాని జాన్సన్ సమావేశాలను వాయిదా వేయడానికి సాహసించారు. తనకు మెజారిటీ మద్దతు లేనప్పటికీ, దమ్ముంటే అవిశ్వాస తీర్మానం పెట్టి ఎన్నికలకు సిద్ధం కండి అంటూ ప్రత్యర్థు లకు సవాలు విసురుతున్నారు. పార్లమెంట్ ఉన్నదా, ఉంటే ప్రధానికి మెజారిటీ ఉన్నదా, ప్రభు త్వమనేది నడుస్తున్నదా అనే అనుమానాలు కలిగే దారుణ స్థితి నెలకొన్నది. ఈ దశలో రాజకీయ విభేదాలు పక్కనపెట్టి దేశానికి దిశానిర్దేశం చేయవలసిన బాధ్యత అన్ని రాజకీయపక్షాల మీద ఉన్నది.

## దివ్యాంగుల సమస్యలకు సత్వరమే పరిష్కారం

### డిఆర్‌ఓ బి.దయానిధి



శ్రీకాకుళం: స్పందన కార్యక్రమంలో దివ్యాంగుల సమస్యలను తెలుసుకొని తక్షణమే షరిష్కారం చేయడం జరుగుతుందని జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి పేర్కొన్నారు. సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయ ప్రాంగణం లోని ప్రజా ఫిర్యాదుల విభాగంలో జిల్లా రెవిన్యూ అధికారి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి అర్జీదారులు హాజరై తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని లెప్రసీ కాలనీకి చెందిన కూర్మారావు, సరుబుజ్జిలి మండలం సిగిడివలస గ్రామానికి చెందిన ఎస్. విజయకుమారి, ఆర్.ఆమదాలవలస మండలం కందిస గ్రామానికి చెందిన ఎన్.రాంబాబు, సంతబొమ్మాలి మండలం చంటిపేటకు చెందిన బి.శంకరరావులు అర్జీలు సమర్పిస్తూ తాము వికలాంగులమని తమకు ట్రైసైకిళ్లను మంజూరు చేయాలని కోరగా తక్షణమే స్పందించిన జిల్లా రెవిన్యూ అధికారి వారికి ట్రైసైకిళ్లను మంజూరుచేసారు. అదేవిధంగా ఎన్. సాయి ౧కుమార్ అర్జీని సమర్పిస్తూ వికలాంగుడైన తనకు వీల్ చైర్‌ను మంజూరుచేయాలని కోరగా సత్వరమే మంజూరుచేసారు. దీంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని నిర్ధేశిత గడువులోగా సమస్యల పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని, అందులో భాగంగా స్పందనలో వచ్చే దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తు న్నట్లు చెప్పారు. పాతపట్నం మండలం కోరసవాడ గ్రామానికి చెందిన సంతోషిపాణిగ్రహి, మరియు ఇతర రైతులు అర్జీని సమర్పిస్తూ కరీంనగర్, హుజురాబాద్‌కు చెందిన గణపతి విత్తనాల కంపెనీ నుండి కొనుగోలు చేయగా కల్తీ విత్తనం సరఫరా చేసారని, కావున సదరు కంపెనీపై చర్యలు తీసుకొని, తమకు తగిన నష్టపరిహారాన్ని ఇప్పించాలని ఫిర్యాదు చేసారు. పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన పి.ఎస్. ప్రకాశరావు అర్జీని సమర్పిస్తూ ఉమ్మడిభూమిని తన తమ్ముడు అక్రమంగా తన భార్య పేరున మార్చారని, కావున తనకు తగిన న్యాయం చేయాలని పిర్యాదు చేసారు. రేగిడి మండలం అంబకంటి గ్రామానికి చెందిన వై. సన్యాసిరావు అర్జీని సమర్పిస్తూ తన ఇంటి ముందు గల ప్రభుత్వ స్థలాన్ని ఇతరులు ఆక్రమించి షాపును నిర్వహిస్తున్నారని, కావున ఆక్రమణను తొల గించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. మాజీ ప్రభుత్వ విప్ కూన రవికుమార్ స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై వినతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె. దయానిధి, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు టి.వేణుగోపాల్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ టి. శ్రీనివాసరావు, ఏ.పి. ట్రాన్స్ కో పర్యవేక్షక ఇంజినీర్ ఎన్.రమేష్ ప్రజల నుండి వినతులు స్వీకరించగా, పలు శాఖాధిపతులు హాజరయ్యారు.

## జర్నలిస్టు బాబూదేవ్‌పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

### అఖిలపక్ష యూనియన్ల డిమాండ్



విశాఖ క్రైం: సీనియర్ జర్నలిస్టు బాబూదేవ్ (బి.వి.ఎస్. దేవ్)పై దాడి చేసిన దుండగులను తక్షణం అరెస్టు చేయాలని అఖిల పక్ష జర్నలిస్టు యూనియన్లు డిమాండ్ చేశాయి. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, జాప్, ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్, క్రైమ్ రిపోర్టర్స్ అసోసియేషన్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్లు సంయుక్తంగా సోమవారం పోలీస్ కమిషనర్ ఆర్.కె.మీనాను కలిసి సంఘటన వివరాలను తెలియజేసి వినతిపత్రం సమర్పించాయి. మద్దిలపాలెం బజారు సమీపంలో సెప్టెంబరు 27వ తేదీ మధ్యాహ్నం సమయంలో దుండగులు బాబూదేవ్‌ను పిడిగుద్దులతో గుద్దారని వెంటనే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా స్థానికులు కేజీహెచ్‌లో చేర్చినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని, అటాక్స్ కమిటీలను ప్రభుత్వం తక్షణం ఏర్పాటు చేసేలా సిఫార్సు చేయాలని జర్నలిస్టుల నాయకులు కమిషనర్‌ను కోరారు. జర్నలిస్టులకు పూర్తి రక్షణ కల్పిస్తామని ఈ దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేస్తామని పోలీస్ కమిషనర్ ఆర్.కె.మీనా హామీ ఇచ్చారు.

అనంతరం జర్నలి స్టులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిం చేందుకు కలెక్టరేట్‌కు వెళ్లగా ఆయన అందు బాటులో లేకపోవడంతో స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా పరిషత్ సీఈఓ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. జరిగిన దాడి, అటాక్స్ కమిటీల నియామకం, జర్నలిస్టులకు రక్షణ వంటి విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నగర అధ్యక్షులు పి.నారాయణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. రవికుమార్, ఉపాధ్యక్షులు శివప్రసాద్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నగర శాఖ అధ్యక్షులు ఆర్.రామచంద్రరావు, కె. చంద్ర మోహన్, లోకల్ న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సత్యనారాయణ, జాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.యుగంధర్ రెడ్డి, నగర కార్యదర్శి కాశీ విశ్వనాథ్, ఏపీ మీడియా ఫెడరేషన్ నగర అధ్యక్షులు జి.జనార్ధనరావు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణ, ఎస్.వి.బి.కుమార్, వీజేఎఫ్ కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి, యూజేఎఫ్ కోశాధికారి కె. రాము, వివిధ సంఘాల ప్రతినిధులు రాజేంద్ర ప్రసాద్, శ్రీహరి, పితాని ప్రసాద్, గొడబ రాంబాబు, భగవాన్, కిషోర్, ఈశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ హిందీ ప్రేమిమండలి ఆధ్వర్యంలో దివస్ ముగింపు కార్యక్రమం



భీమునిపట్నం: స్థానిక ఆదర్శ హిందీ ప్రేమిమండలి ఆద్వర్యంలో జరిగిన హిందీ దివస్ 70వ వసంతాలు పూర్తి చేసుకున్న సంద ర్భంగా ఆదర్శ హిందీ ప్రేమీమండలి ఆధ్వ ర్యంలో పక్షోత్సవాల కార్యక్రమం ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ఆదర్శ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు, భీమిలి డివిజన్ టిడిపి అధ్యక్షుడు గంటా.నూకరాజు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ ఆదర్శ హిందీ ప్రేమీ మండలి స్థాపించి నేటికి 70 వసంతాలు పూర్తిచేసు కుందని, జాతిపిత మహాత్మా గాంధీ చేతులమీదుగా స్థాపించిన ఈ ప్రేమిమండలి ద్వారా నేటికి కొన్నివేలమంది విద్యార్థిని విద్యార్థులకు మనదేశంలో హిందీ యొక్క ప్రాముఖ్యతను వివరించి తద్వారా ప్రాథమిక, మాధ్యమిక పరీక్షలు వ్రాయించి సర్టిఫికెట్ లను ఇవ్వడం జరుగుతుందని వివరించారు. హిందీ భాష నేర్చుకొని వివిధ రంగాల్లో స్థిరపడినవారు ఉన్నారని, ఇటువంటి సంస్థకు నేను గౌరవ అధ్యక్షుడు గా ఉండటం ఆనందం గా వున్నాదని . ఆదర్శ హిందీ ప్రేమిమండలి 70 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా గత 15 రోజులుగా విద్యార్థిని విద్యార్థులకు వివిధ జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్రలమీద వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు, డిబేట్ లాంటివి పెట్టడం జరిగిందని , ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడమైనదని గంటా నూకరాజు తెలిపారు .ఆదర్శ హిందీ ప్రేమి మండలి భీమిలి శాఖకు సంబంధించి చైర్మన్ గా వ్యవహరిస్తున్న కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాస్టర్ వృత్తి రీత్యా రిటైర్ అయినప్పటికీ ఎంతో ఓపికగా ప్రతీ పాఠశాలకు వెళ్లి విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడి హిందీ భాషపై అవగాహన కల్పించి చైతన్యం తీసుకొని వస్తున్నారని, నేటికి భీమిలిలో ఎక్కువమంది హిందీ పరీక్షలు ఉత్తీర్ణులవుతున్నారంటే అది కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాస్టర్ యొక్క గొప్పతనమని తెలిపారు.

ఈ పక్షోత్సవాలు ఇంత ఘనంగా జరిగా యంటే అది మాస్టర్ యొక్క గొప్ప తనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వుయ్ కేర్ యు సంస్థ సభ్యులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎచ్చెర్ల జగన్నాధ స్వామి, కనకల సన్యాసినాయుడు, రాజేష్ పాల్గొన్నారు.

## బృందంగా పనిచేస్తే మెరుగైన ఫలితాలు

### ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆచార్యులు, ఉద్యోగులు సమిష్టిగా పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధ్యపడతాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూను ఐఎస్ఓ గుర్తింపు కమిటి సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులతో సెనేట్ మందిరంలో వర్సిటీ విభాగాధిపతులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. నేడు మనం పోటీ ప్రంచంలో ఉన్నామన్నారు.

నిత్యం ప్రగతిని చూపుతేనే మెరుగైన ర్యాంకులను సాధించడం వీలవుతుందన్నారు. ప్రతీ వ్యక్తి నాణ్యత నిలుపుకునే దిశగా పనిచేయడం దినచర్యలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. కమిటి సభ్యులు కోరిన సమాచారం, రికార్డులను విభాగాధిపతులు అందించాలన్నారు. విభాగాధిప తులు మారే సమయంలో సంబంధిత రికార్డులను తరువాత వచ్చే వారికి అందించి, అవసరమైన అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్‌కు తెలిపారు. ఐఎస్ఓ ఆడిటర్ జి.వి చలపతి మాట్లాడుతూ ఐదో పర్యాయం ఏయూలో ఈ ఆడిట్ నిర్వహించడం జరుగుతోందన్నారు. అంతర్గత ప్రమాణాలను గణించి, మరింత మెరుగు పరచుకోవడానికి ఇవి ఉపకరిస్తాయన్నారు.విశ్వవిద్యాలయానికి మంచి నాయకత్వం అవసరమని, వర్సిటీ దీనిని కలిగి ఉందన్నారు.ప్రమాణాలను నిలుపుకుంటూ విశ్వవిద్యాలయం పనిచేస్తోందన్నారు.

కార్యక్రమంలో ఆడిటర్లు క్రిష్ణమోహన్, రామారావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, ఐక్యూఏసి సమన్వయకర్త ఆచార్య డి.లలిత భాస్కరి తదితరులు పాల్గొన్నారు.

## యువత స్ఫూర్తిదాయకంగా నిలవాలి

### ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి




ఆంధ్రవిశ్వవిద్యాలయం : యువత స్ఫూర్తిదాయకంగా నిలవాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ విభాగం ఎలక్ట్రో బ్లిడ్జ్ రెండు రోజుల సాంకేతిక సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు అభిరుచితో పనిచేస్తేనే అద్భుతాలు ఆవిష్కరించడం సాధ్యపడుతుందన్నారు. విద్యార్థులు నిర్ధిష్ట లక్ష్యం ఏర్పరచుకుని దానిని సాధించే దిశగా పనిచేయాలన్నారు. క్రమశిక్షణకు విద్యార్థినులు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని, దీనిని నిలుపుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వారి అసరాలు తెలుసుకున్నారు. త్వరలో మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు అవసరమైన పూర్తిస్తాయి మౌళిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. తాను రిజిస్ట్రార్‌గా పనిచేసిన కాలంలో ఈ కళాశాలను స్థాపించడం, అనుమతులు తీసుకురావడం జరిగిందని విద్యార్థులకు వివరించారు. కళాశాల విద్యార్థినులకుమెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు కృషిచేస్తున్నామన్నారు. సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. విద్యార్థినుల చిత్రకళా ప్రదర్శనను తిలకించి, వారి ప్రతిభను అభినందించారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.ప్రమీల దేవి, విభాగాధిపతి డాక్టర్ ఎస్.అరుణ, విభాగాధిపతులు కె.చంద్రశేఖర రావు,బి.ప్రజ్ఞ, ఎస్.కె భట్టి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సనపల చంద్రమౌళి జన్మదిన వేడుకలు

### ముఖ్య అతిథిగా విచ్చేసిన పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనువాసరావు



విశాఖపట్నం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సనపల చంద్రమౌళి జన్మదిన వేడుకలు మాధవధార 39వ వార్డు మౌళి క్యాజిల్స్లో సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనువాసరావు ముఖ్య అతిధిగా పాల్గొని కేకను కట్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి సనపల చంద్రమౌళి చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఇటువంటి ప్రజ ల నాయకులు సనపల చంద్రమౌళి జన్మదినోత్సవంలో పాల్గొవడం తమకు ఎంతో అనందంగా ఉందని అ న్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు గజమా లతో సన్మానించారు. ఉదయం నుండి అభిమానులు మధ్య జన్మదినం చేసుకోవడం తమకు ఎంతో అనంద 0గా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజక వర్గం సమన్వయకర్త రెకె. రాజు, చొక్కాకుల వెంకటరావు, మాజీ కార్పొరేటర్లు బాణాల శ్రీనువాసరావు, సేనాపతి అప్పారావు, మ హిళా అధ్యక్షురాలు పిల్లా వెంకటలక్ష్మి, యూత్ ప్రెసిడెంట్ కె.శ్రీనువాసరెడ్డి, వార్డు అధ్యక్షులు పప్పల సునీత , కటూమూరి సతీష్, చల్లా ఈశ్వరరావు, కెవి. బాబా, పైడ్ రమణ, దుప్పలపూడి శ్రీనువాసరావు, బొడ్డేటి నా గు, బి.యల్లాజియాదవ్, ముత్యం సూర్యారావు, నార్త్ మహిళా ప్రెసిడెంట్ ఎస్.పద్మరెడ్డి, ఉత్తర నియోజక వర్గం యూత్ అధ్యక్షులు నంవాళ్ళ ఈశ్వరరావు, పైడి శ్రీనువాసరావు, ప్రకాష్, శరత్, వెంకట్, సోని, రత్న ఉమాపతి, వి.వెంకటరావు, శంకర్ కృష్ణారావ ఓ అప్పారావు, విజయ్, సీపాన రాము తదితరులు పాల్గొన్నారు.



# పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

## సాంకేతిక వినియోగంపై రాష్ట్రస్థాయి ముగింపోత్సవంలో చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్ నరేష్ బర్లంగి


సాంకేతిక వినియోగం రాష్ట్రస్థాయి ముగింపోత్సవ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులతో చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్ నరేష్ బర్లంగి

చోడవరం : రోజురోజుకు సాంకేతికత మారుతున్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఎప్పటికప్పుడు తమ నైపుణ్యా లను పెంపొందించుకోవాలని చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్ నరేష్ బర్లంగి అన్నారు. పట్టణంలోని స్థానిక భవిత కేంద్రంలో మూడు రోజుల పాటు సాంకేతికపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశం సోమవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్ నరేష్ మాట్లాడుతూ ప్రత్యేక ఉపాధ్యాయులు మారుతున్న సాంకేతికతపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచు కోవడంతో పాటు దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగించేవిధంగా తర్ఫీదు నివ్వాలని, తద్వారా దివ్యాంగులు సాధికారత మరింత సాకారమవుతుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించిన జాతీయ బహుళ వైకల్య సాధికారత సంస్థ, చెన్నై, జాతీయ న్యాయ సాధికార సంస్థ, భారత పునరావాస చట్టం వారు జారీ చేసిన సర్టిఫికెట్లును రామ్ నరేష్ చేతుల మీదుగా శిక్షణకు హాజరైన వారికి అందజేశారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు భీశెట్టి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్క్ స్వచ్ఛంధ సంస్థ ప్రతి నిధి ప్రసాద్, రిటైర్డు అధ్యాపకులు ఎన్.దేముడు,ఆయా సంస్థల ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

**CHANGE OF NAME**

I,KESA GOVINDA RAO ALLA
S/O PEDDINAIDU ALLA
Residing at
Door No. 30-66-21,
GANDHI BOMMA JUNCTION
OPP KANITHI RH COLONY
VADLAPUDI,
VISAKHAPATNAM DIST.,AP
Do hereby declared that Changed my old name
KESA GOVINDA RAO ALLA
to New name
KESU GOVINDA RAO ALLA
I request all to consider my name
KESU GOVINDA RAO ALLA
S/O PEDDINAIDU ALLA

## ఏఎస్ఐ వామన మూర్తికి ఘన సన్మానం

నర్సీపట్నం : పోలీసు ఉద్యోగం ద్వారా ప్రజలకు సేవ చేయాల్సిన రావడం ఎంతో భాగ్యం అని జిల్లా ఎస్పీ అట్టాడ బాపూజీ తెలిపారు నర్సీపట్నం ప్రాంతంలో గత కొన్నేళ్లుగా ఏఎస్ఐ గా ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వామన మూర్తి సోమవారం పదవీ విరమణ చేశారు. వామనమూర్తి విభిన్న సేవలు అందించారని ని ఉన్నతాధికారులు ఆయనను ప్రశంసించారు.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM

O.S.No.497/2019

**Between :**
**M/s Lakshmi Finance, Rep.by its SPOA Holder, Kondra Anand ...Plaintiff**
**And**
**Devasani Nirmala & Another ...Defendants**

**NOTICE**

**Defendants:**
**D1: Devasani Nirmala W/o.Damodar, Aged 37 years, D.No.7-8-1/4, Ville Royal Apartments, D-9, Opp.Vuda Children Theature, Siripuram,Visakhapatnam-530003**
**D2: Kakula Barnabas Raju, S/o.Raja Babu, Aged 40 years, Fakers Layout, Ramnagar,Visakhapatnam -530002**

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **16-10-2019 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

Sri Tulala Venkateswara Rao
Sri Kurumuji Koteswara Rao
Advocates
Visakhapatnam.
Cell No: 9985747149;9491914100

## సీతంపేటలో ఘనంగా
# దుర్గాదేవి శరన్నవరాత్రులు



దేవరాపల్లి : మండలంలోని నాగయ్య పేట పంచాయితీ శివారు గ్రామం సీతంపేటలో ఆదివారం శ్రీ దుర్గాదేవి అమ్మవారి శరన్నవ రాత్రులు ఘనంగా భవానీ భక్తులు విశేష డప్పుల, మేళాలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి దేవి శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభించారు. ఈ అమ్మవారి శరన్నవ రాత్రులు ఘనంగా జరుపుకునేందుకు ప్రతి ఇంటా ఒకరు లేదా ఇద్దరు అమ్మ భవాని మాల ధరించి కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి అంటూ భవానీ భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఏ రోజు రూపం ఆరోజు ప్రత్యేక అలంకారం చేసి ప్రధానార్చకుడు నరసింహ మూర్తి తో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం బాల త్రిపుర సుందరి రూపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆ గ్రామమంతా ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరి నోటా జయహొ దుర్గమ్మ అంటూ భక్తులు అమ్మవారిని కీర్తిస్తున్నారు.

## భీమిలి మెయిన్ రోడ్ వెడల్పు చేయాలని జోనల్ కమిషనర్‌కి వినతి పత్రం

భీమునిపట్నం : స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ నుండి గంటస్తంభం మీదుగా అలాగే చిన్న బజార్ పోలీస్ స్టేషన్ వరకు, అలాగే గంట స్తంభం మెయిన్ రోడ్ లు విస్తరణలు చెయాలని, సోమవారం జోనల్ కమీషనర్ సి.హెచ్ గోవిందరావు కు అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సభ్యులు వినతి పత్రం అందజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమునిపట్నం ఎమ్మార్వో ఆఫీస్ నుండి గంటస్తంభం మీదుగా చిన్న బజార్ పోలీస్ స్టేషన్ వరకు ఉన్న ఎం.జి రోడ్డు మార్గము ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా లేదని ఈ రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపారాలు వున్నాయని అలాగే బీచ్ వెళ్లే మార్గము వర్తక వ్యాపారస్తులు, చిల్లర వ్యాపారస్తులు ఉన్నారని బీచ్ రోడ్ బస్సులు భీమిలి లో జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశంలో వెళ్ళడంతో ఆ రోడ్ లో బస్సు వెళ్తున్న సమయం లో ఆటో వచ్చిన కారు వచ్చిన చాలా ఇబ్బందులు పడవలసి వస్తున్నాదని వారు తెలిపారు. గతంలో చాలాసార్లు రోడ్లు విస్తరణ గురించి ప్రతిపాదించినప్పటికీ విస్తరణకు నోచుకోలేదని, రోడ్లు విస్తరణ చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవు తున్నారని, రోడ్ లకు ఆనుకొని షాపులు ఉండడంవలన తరుచు ప్రమాదాలు కూడా జరుగు తున్నాయని అన్నారు. ఈ యొక్క సమస్యపై స్పందించి రోడ్ల విస్తరణ చేయవలసిందిగా వారు కోరారు.

## మరుగుదొడ్ల నిధులు స్వాహాపై పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి
### సీపీఎం నాయకులు మొస్యా

అనంతగిరి : వేంగడ పంచాయతీ స్వాచ్ఛబారత్ మరుగుదొడ్లు కట్టకుండా నిధులు స్వాహా చేసిన వేంగడ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పై చర్య తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నం స్పందన కి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు ఈకార్యక్రమంలో గిరిజన నాయకులు కొండలరావు, మొస్య, సుబ్బారావు, హామీ మాట్లాడుతూ వేంగడ పంచాయతీ పరిధిలో స్వచ్ఛ భారత్ ద్వారా 388 మరుగుదొడ్లు మంజూరు అయ్యాయని వాటిలో కొన్ని రేకులు వేసి సెప్టిక్ ట్యాంకు నిర్మాణం చేయ కుండా మరి కొన్ని పునాదులు వెయకుండా పూర్తి బిల్లులు మార్చు కొనరని తెలిపారు. వెంటనే విశరణ జరిపి వేంగడ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బాలకార్మికులకు డీడీలు అందజేయాలి



విశాఖపట్నం : విశాఖ నగరంలో 2006 నుంచి నేటివరకూ బాలకార్మికులకు అందజేయవలసిన డిడిలు అందజేయలేదని వాటిని తక్షణం వారిక అందజేయాలని రాష్ట్రబాలల హక్కుల కమిషన్ సభ్యులు కేసలి అప్పారావు బాలల హక్కుల వేదిక కన్వీనర్ బి. హరి వెంకట రమణ కోరారు. సోమవారం నగరంలో కేసలి అప్పారావుకు ఈ మేరకు బాలలతో కలిసి వినతిపత్రం అందజేశారు. పద్నాలుగు సంవత్సరాలలోపు బాలకార్మికులుగా పట్టుబడిన వారికి పద్దెనిమిది సంవత్సరాలు నిండిన తరువాత యజమాని నుంచి వసూలు చేసిన పరిహారం డిడిరూపంలో అందజేయవలసి ఉంది, అయితే విశాఖనగరంలో గత పదేళ్లలో ఈ మేరకు ఎటువంటి ప్రయత్నం జరగలేదు. బాలల హక్కుల వేదిక తరపున గత రెండు సంవత్సరాలుగా పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు,జాతీయ బాలల హక్కుల కమిషన్‌కు విన్నవించారు. ఈ మేరకు గత నెలలో జాతీయ బాలల హక్కుల కమిషన్ విశాఖ వచ్చినపుడు సయితం వారికి వినతిపత్రం అందజేయగా రెండు వారాలలో బాలలకు డిడిలు అందజేయవలసిందిగా జాతీయ బాలల హక్కుల కమిషన్ లేబర్ డిపార్ట్‌మెంట్‌ను ఆదేశించింది. ఆదేశాలు జారీచేసి రెండు నెలలు గడుస్తున్నా ఈ విషయంలో పురోగతి లేకపోవడంతో మరో మారు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేసినట్లు బాలల హక్కుల వేదిక కన్వీనర్ హరి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు కేసలి అప్పారావు స్పందిస్తూ జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు మరియు బాలలకు డిడిలు అందజేయడంలో సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల సంఘాల ప్రతినిధులు సయితం పాల్గొన్నారు.

# బాక్సైట్ జీఓ రద్దుతో ప్రశాంతంగా మన్యప్రాంతం

## రాష్ట్ర యస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి


అనంతగిరి లో విలేకరులు తో మాట్లాడుతున్న రాష్ట్ర యస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి

అనంతగిరి : విశాఖ మణ్యంములో బాక్సైట్ తవ్వకాల జీఓ నెంబర్ 97ను రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పూర్తిగా రద్దు చేయడంతో గిరిజన ప్రాంతం లో ప్రశాంత వాతావరణం ఏర్పడిందని రాష్ట్ర యస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, శెట్టి గంగా ధర స్వామి, సోమవారం అనంతగిరి లో విలేకరులు తో మాట్లా డుతూ చాలా కాలంగా బాక్సైట్ తవ్వకాల పై స్పష్టత లేక పోవడం తో అయోమయ పరిస్థితిలో బిక్కు బిక్కు మంటూ కాలం గడిపారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు స్పష్ట మైన హామీ ఇవ్వడంతో గిరిజన మోములో ఆనందం వెల్లివిరిసిందని, బాక్సైట్ రద్దుతో గిరిజనులంతా స్థానిక ఎన్నికల్లో వైసీపీ పార్టీకు, పట్టం కట్టాలని భావిస్తున్నారని అని ఆయన అన్నారు ఇదే విధంగా ముఖ్య మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించి గిరిజన వర్శిటీ అరకు లోయ లో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని శెట్టి గంగా ధర స్వామి, కోరారు, యూనివర్సిటీ ఏర్పాటు చేయడం వల్ల మరింత అభివ ృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# మెప్మా ఆధ్వర్యంలో ఘనంగా పోషకాహార మాసోత్సవాలు



నర్సీపట్నం : చిరుధాన్యాలతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను మెప్మా ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. సోమవారం పోషకాహార మాసోత్సవాలు ముగింపులో భాగంగా మెప్మా అధికారులు పలువురు గర్భిణీ స్త్రీలకు సామాజిక సీమంతాలు నిర్వహించారు. ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహించారు. వెల్ బేబీ సో ఇతర కార్యక్రమాలు నిర్వహించిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గా మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, ఐసి డిఎస్ సిడిపిఓ జి.వి రమణి మాట్లాడుతూ అంగన్వాడీ ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఇరుగు పొరుగు పరిశుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ను నివారించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పట్టణ అధ్యక్షురాలుతో పాటు సిఎం ఎం.లలిత ,కమ్యూనిటీ ఆర్గనైజర్ రవి, సిఆర్పిలు ఆర్పిలు పలు సంఘాలు లీడర్లు పాల్గొన్నారు.

## జీవీఎంసీ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం : ఆశిల్ మెట్ల, అశోక్ నగర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో నిర్వహించిన విశాఖ సౌత్ సమన్వయ కమిటీ మీటింగ్ జరిగింది. విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్. ఈ మీటింగ్ లో ప్రధానంగా ప్రస్తుత గవర్నమెంట్ పరిపాలన వ్యవస్థ ప్రజలకు అనుకూలంగా లేక పోవడంతో చాలా వ్యతిరేక రావటంవలన మరియు విశాఖ అర్బన్ లో నాలుగు టీడీపీ ఎమ్మెల్యేలున్న కారణంగా రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగర వేయటానికి మన మంత కలిసి పార్టీ విజ యానికి కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. ప్రధానంగా ఇసుక కొరత తీవ్రంగా ఉండటం వలన చాలామంది భవన నిర్మాణ కార్మికులకు కనీస పని లేకుండ వీధిన పడే పరిస్థితి ఏర్పడింది. మరియు ముఖ్యంగా జీవీఎంసీ (ఎన్నికల కారణంగా మధ్యలో నిలిపి వేసిన) పాతవి కొత్తవి పనులు ఇప్పటికి మొదలవ్వలేదు, అభివృద్ధికి నోచుకోలేదు. పవర్ తరుచుగా పోతుం డటం, గ్రామ వాలంటీర్ల వ్యవస్థ ఫెయిల్ అవ్వటం, వర్షాలు ఎక్కువ పడుతున్న కారణంగా యూజీడి సమస్యలు, అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా పనులు వల్ల గుంతలు తవ్వేసి సకాలంలో పూర్తి చేయకపోవడం, వర్షం నీరు నిలుపుదల వల్ల రోగాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతీ ప్రజల సమస్యలు పరిష్కరించటానికి విశాఖ సౌత్ లో రోజూ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కి తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. డైలీ న్యూస్ పేపర్ లో వచ్చే సమస్యలే కాకుండా నేరుగా ప్రజల వద్దకు వెళ్లి ప్రజల సమస్య లను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొనివస్తే అధికారులు దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపడదామని పిలుపునిచ్చారు. దసరా పండగ తర్వాత ప్రతీ వార్డులో ప్రతీ రోజు ప్రజాదర్బార్ నిర్వహిస్తామని తెలియజేసారు. మరియు ప్రధానంగా నిరుద్యో గులుకు నిరుద్యోగభృతి ఈ ప్రభుత్వం తీసివేసిన కారణంగా వారికి ఉద్యోగమేళ నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్థానని తెలియజేశారు.

# నేడు 'సైరా బైక్ ర్యాలీ'

విజయనగరం : అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు స్వామినాయుడు పిలుపు మేరకు జిల్లా గౌరవ అధ్యక్షులు ఒమ్మి శ్రీను సారధ్యంలో జిల్లా అధ్యక్షులు రాంకి ఆధ్వర్యంలో నేడు మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీ పైడితల్లమ్మ కోవెల నుండి స్థానిక ఎన్.సి.ఎస్.దియేటర్ వరకు మెగా 'సైరా బైక్ ర్యాలీ' జరుగును. కావున మెగా అభిమానులు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము.

జిల్లా మెగా ఫ్యామిలీ సేవా సంఘం, విజయనగరం. సెల్ నెంబర్స్ :98661 74598, 99667 70075

# ఊరి మధ్యలో మద్యం షాపు వద్దు



కొయ్యూరు : కొయ్యూరు మండలంలో రాజేంద్రపాలెం గ్రామంలో మద్యం షాపు వద్దంటూ ఆందోళన చేశారు. ప్రభుత్వం నిర్వహించే మద్యం షాపు ఇళ్ల మధ్యలో నిర్వహించడం వలన, చుట్టు ప్రక్కల వారంతా నానా ఇబ్బందులు పడతారని, దీనివలన చుట్టుపక్కల పిల్లలు కూడా చెడు వ్యసనాలకు దగ్గరయ్యే అవకాశం ఉందని, వారంతా తహాశీల్ధారు కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ, ఊరి మధ్యలో మద్యం షాపు వద్దు, గుడికి, బడికి మద్యం షాపు దూరంగా వుండాలంటూ నినాదాలు చేస్తూ, తహశీల్ధారు ఆఫీసుకు చేరుకుని, వినతిపత్రంను తహాశీల్ధార్ నైటింగెల్‌కు అందజేశారు.

## దివ్యాంగుల ప్రయోజన శిబిరానికి విశేష స్పందన

అనంతగిరి : దివ్యాంగుల ప్రయోజన శిబిరంనకు సోమవారం విశేష స్పందన లభించి నట్లుగా అనంతగిరి మండల ప్రజా పరిషత్ అభివ ృద్ధి అధికారి ఏవివి కుమార్ తెలిపారు. అనంతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేశారు మండలం నలుమూలల నుంచి పలువురు దివ్యాంగులు హాజరయ్యారని ఎంపీడీవో కుమార్ అన్నారు వీరిని పరీక్షించేందుకు పలువురు నిపుణులను ఉన్నత అధికారులు పంపించారని ఎంపీడీవో తోపాటుగా నిపుణులు దివ్యాంగులకు పరీక్షించి వారికి అవసరమైన వాటిని సంబంధించిన వివరాలు నమోదు చేసు కున్నట్టుగా తెలిపారు, ఎంపీడీఓ తో పాటు వివరాలు నమోదు చేసుకున్నట్లుగా తెలిపారు ఈ వివరాలను ప్రభుత్వానికి పంపించి అక్కడి నుంచి వచ్చే సామాగ్రి స్థానిక ఎమ్మెల్యే చేతులమీదుగా వారికి అందిస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడుగా భీమారావు



భీమునిపట్నం: స్థానిక సరస్వతీ సమాజంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా పించనుదారుల సంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.డి ప్రసాదరావు, పి. సూర్య చంద్రరావు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. రెండేళ్ల కాలానికి నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడుగా తట్టి కోట.భీమారావు, అసోసియేట్ అధ్యక్షుడుగా ఎం. ఆనంద రావు, ప్రధాన కార్యదర్శిగా శిరిగుడి. సూర్య నారాయణ, కోశాధికారిగా మైలపల్లి శ్రీహరిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మొహమ్మద్ మూసా, ఉపాధ్యక్షులుగా పి.జానకేశ్వర రావు, ఎస్. అప్పలనాయుడు, జి.నారాయణ రావులు ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా పించనుదారులను సత్కరించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీముని పట్నం, ఆనందపురం, పద్మనాభం మండలాల పెన్షనర్లు పాల్గొన్నారు.

## రిటైర్‌మెంట్ జీవితం, ఆనందంగా, ఆహ్లాదంగా, ఆరోగ్యంగా గడపాలి
### - అదనపు కమిషనర్ ఏ.వి.రమణి



విశాఖపట్నం : రిటైర్‌మెంట్ జీవితం, ఆనందంగా, ఆహ్లాదంగా ఆరోగ్యంగా గడపాలని జివియంసి అదనపు కమిషనర్ ఏ.వి.రమణి పేర్కొన్నారు. జివియంసి కాన్ఫరెన్స్ హాలులో సోమవారం రిటైరైన ఇద్దరు ఉద్యోగులకు సన్మానించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు విధులను సంతృప్తి కరంగా నిర్వహించి రిటైర్ కావడం పట్ల అభినందన తెలిపారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి సూపరింటెండెంట్ నరశింగరావు అధ్యక్షతవహించారు.

కార్యక్రమంలో మేనేజర్ ముత్యాలరావు, సూపరింటెండెంట్ నరశింగరావు, జివియంసి సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పదవివిరమణ గావించిన సీనియర్ సహాయకులు ఎమ్.ఆర్.సి.హెచ్.కె కుమార్, మజ్దూర్ కె.రాధక్రిష్ణలను అదనపు కమిషనర్లు ఏ.వి.రమణి సత్కరించారు.

# బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం

**- 9మందికి తీవ్రగాయాలు - ఆసుపత్రికి తరలింపు - ముగ్గురు పరిస్థితి విషమం**



కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు గూడపర్తి పంట పొలాల్లో రహస్యంగా ఏర్పాటు చేసిన బాణాసంచా తయారీ కేంద్రంలో సోమవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాద సమయంలో 12మంది బాణాసంచా తయారీ చేస్తుండగా, 9మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారంతా మహిళలు కాగా వారినందరినీ కాకినాడ రామారావు పేటలోని వెంకట చలపతి నర్సింగ్ హోంకు తరలించి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విష మంగా ఉందని వైద్యులు వెల్లడించారు. పెద్దాపురం డిఎస్పీ అరిటాకుల శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం మేడ పాడు గ్రామ శివారు ఇందిరాఫైర్ వర్క్స్ పేరిట బొబ్బరాడ సత్తిబాబు బాణాసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడని సుమారు 15 మంది సోమవారం పనికి రాగా 12మంది బాణాసంచా తయారీ పనిలో నిమగ్నమై ఉండగా ఉదయం 9 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని 9మంది మహిళలు తీవ్రంగా గాయ పడ్డారని తెలిపారు. గాయపడిన వారిలో కాకర అనిత(30), బక్కిన లోవ కుమారి (35)గొల్తి చెల్లమ్మ (50), కొంగు లక్ష్మి(40), చిల్లి వీర రాఘవమ్మ (40), కొయ్యాలక్ష్మి(50), బొబ్బర ధనలక్ష్మి(40), కంక ణాల సత్యవేణి (25), యాసరపు అరుణ(27), తీవ్రంగా గాయ పడ్డారని వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. గాయపడినవారి నందరినీ కాకినాడ రామారావు పేటలో గల వెంకట చలపతి నర్సింగ్ హోం నందు చేర్చి వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు.

గాయపడిన వారిని వ్యవసాయ శాఖామంత్రి కురసాల కన్నబాబు, జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అధ్నామ్ నయీం అస్మీ, పెద్దాపురం వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొలూరి దొరబాబు తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కన్నబాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాద భాదితు లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదు కొంటుందని తెలిపారు. కలెక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ తయారీ కేంద్రానికి అనుమతులు ఉన్నాయని భాదితులను అన్నివిధాలా ఆదుకొంటామని వెల్లడించారు.

# వేములపూడిలో రెండు సచివాలయాలు ఒకేచోట ప్రారంభానికి సన్నద్ధం

**సచివాలయాలను పరిశీలించిన డిఎల్‌పిఓ తహశీల్దార్ ఎంపీడీవో**



వాలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో





వేములవాడలో సిద్ధంగా వున్న సచివాలయం

నర్సీపట్నం : సచివాలయం ప్రారంభానికి సన్నద్ధంగా ఉన్నది లేనిది డిఎల్‌పిఓ ఆర్.శిరీషరాణి, మండల తాసిల్దార్ శ్రీనివాసరావు, ఇన్చార్జి ఎంపీడీవో రమణబాబు, ఈవోపీఆర్డీ ప్రేమలీల తదితరులు గ్రామాలకు వెళ్లి సచివాలయాన్ని పరిశీలన చేశారు. ఇప్పటికే గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్యాలయాలు బోర్డు మార్చి రంగులు వేసి సచివాలయాలుగా కొత్త హంగులను చేర్చారు. వేములపూడి లో వేములపూడి ఒకటి, సచివాలయం తో పాటు అదే ప్రాంతంలో లో మెట్టపాలెం గ్రామానికి సంబంధించి మరొక సచివాలయాన్ని వేములపూడి లోనే ప్రారంభానికి సన్నాహాలు చేశారు .పంచాయతీ పరిపాలన అధికారి సంజీవరావు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆకర్షణీయంగా కార్యాలయాలను రూపొందిస్తున్నారు. ముఖ్యమంత్రి చిత్రపటం తో కూడిన లైటింగ్ తో ప్రత్యేక పేరు కలిగిన బోర్డును అమర్చడం లో కార్యదర్శి ప్రత్యేక శ్రద్ధ వహించారు దీంతో పాటు భారీగా స్వాగతం చెప్పేందుకు బోర్డును ఏర్పాటు చేయించారు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అద్భుతమైన పెయింటింగ్ లు వేయించారు. చెట్టు పల్లి లో పంచాయతీ కార్యదర్శి రమణబాబు తదితరులు ప్రత్యేకంగా సమావేశమై రెండూ ఒకేచోట ప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

మండలం పరిధిలో 9 సచివాలయాలు ఏర్పాటు కావలసి ఉండగా ప్రస్తుతం సచివాలయానికి మాత్రమే భవనాలు అందుబాటులో ఉన్నాయి. మిగతా రెండు భవనాలకు స్థలాలు సేకరించి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది దీనికి సంబంధించిన ఫర్నిచర్ను త్వరలో ప్రభుత్వం పంపిస్తుందని ఎంపీడీవో విజయభాను ప్రతినిధికి తెలిపారు.

# పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి 14 అర్జీలు



పెద్దాపురం : ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 14 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. వీటిలో అక్రమ విద్యుత్ వినియోగించి సేద్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోమని ఒకటి,పట్టాదారు పాసు పుస్తకం ఇప్పించమని ఒకటి, ఆక్రమణకు గురైన ఇంటిని తిరిగి ఇప్పించమని ఒకటి,పట్టాదారు పాసు పుస్తకంలోని వివరాలు సరిచేయమని ఒకటి,సీలింగ్ భూమికి యాజమాన్య హక్కు పత్రం ఇప్పించమని ఒకటి, పోలవరం కాల్వ ఆర్‌ఆర్ ప్యాకేజ్ లో పేర్లు చేర్పించమని రెండు,డ్రైనేజీల క్లీనింగ్ సరిగా చేయించమని రెండు, గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయించమని రెండు,విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్ వద్ద ప్రమాద భరితంగా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించమని ఒకటి, ఏలేరు ప్రాజెక్టు నిర్మాణంలో ఇళ్లను కోల్పోయిన వారికి ఇండ్లు నిర్మించమని ఒకటి, భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం ఇప్పించమని ఒకటి అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు.

# సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఆంధ్రాయూనివర్శిటీ బాస్కెట్‌బాల్ ఉమెన్ టీమ్ సెలక్షన్స్



విశాఖపట్నం : స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాల ఆవరణలో ఆంధ్రాయూనివర్శిటీ బాస్కెట్‌బాల్ ఉమెన్ టీమ్ సెలక్షన్స్ జరిగాయి. అదేవిధంగా ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ జరిగింది. బుల్లయ్య కళాశాల టీమ్ విజేతలుగా, సెయింట్ జోసెఫ్ కళాశాల జట్టు రన్నర్స్ ఆఫ్‌గా నిలిచారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రాయూనివర్శిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణ మోహన్, ప్రొఫెసర్ ఎన్.విజయమోహన్ హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైజి, స్పోర్ట్స్ క్లబ్ మెంబర్స్ క్రీడావిభాగాధిపతి డా.టి.శేషులత క్రీడాకారిణులను అభినందించి, సత్కరించారు.డా.టి.శేషులత గత 37 సంవత్సరాలుగా కళాశాలలో పనిచేస్తూ అనేకమంది క్రీడాకారిణులకు తర్ఫీదునిచ్చి, తమ కళాశాల తరపున మరియు ఆంధ్రా యూనివర్శిటీ తరపున ప్రాతినిధ్యం వహించడానికి కృషి చేశారని ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తెలియజేశారు. మా కళాశాలలో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిం చడానికి అవకాశమిచ్చిన యూనివర్శిటీ అధికారులకు డా.శేషు లత కృతజ్ఞతలను తెలియజేశారు.

ప్రవీణ్ రమణి, విజయకుమార్ తదితరులు డా.శేషులతను, క్రీడాకారి ణిలను అభినందించారు. డా.సిస్టర్ వెరోనికా (మెమోరియల్) టోర్నమెంట్‌ను నిర్వహించి, బహుమతులను అందజేశారు. బ్రోచర్‌ను విడుదల చేశారు.

# భీమిలి, తగరపువలస ప్రాంతవాసులకు ప్రతీ రోజూ కొళాయిలు

భీమునిపట్నం: భీమిలి తగరపువలస ప్రాంతాలలో ఇక మీదట ప్రతిరోజు కొళాయులు నలబై ఐదు నిమిషాలు పాటు వస్తాయని జోనల్ కమీషనర్ సి హెచ్ గోవిందరావు తెలియజేశారు. తగరపువలస ప్రాతంలో ఇప్పటి వరకూ జాతీయ రహదారుల పనులు జరుగుట వలన నీటి పైపు లైన్ లు పగిలి పోవడం వలన నీటి సరఫరా కు ఆటంకం కలిగిందని. మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు జి.వీ ఎంసి అధికారులు హైవే అదికారులతో మాట్లాడి జాతీయ రహదారుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.ఇందులో బాగంగా అక్కడ పని పూర్తి అవడం తో తగరపువలస 9,10,11,12 వార్డుల ప్రజల మంచినీటి సమస్య పరిష్కరించామని ,అదేవిదంగా పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కారణంగా భూగర్భ జలాలు పెరగటం వలన భీమిలి తగరపువలస ప్రాంత వాసులకు ప్రతీ రోజు కొళాయి ఇస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు.

# అప్పన్నను దర్శించుకున్న సినీ ప్రముఖులు





సింహాచలం : సింహగిరిపై వేంచేసి ఉన్న సింహాద్రి అప్పన్నని తెలుగు సినీ పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి మరియు మాటల రచయత అబ్బూరి రవి మొదలగు సినీ ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు సింహగిరికి చేరుకున్న వీరికి సింహాచలం దేవస్థానం ఆలయ అధికారులు మేలతాలములు మంగళ వాయిద్యాల నడుమఘనస్వాగతం పలికారు. కప్పస్థంభం ఆలింగనం అనంతరం స్వామివారికి తమగోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం వేదపండితులు అధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్ధప్రసాదాలు అందజేశారు.

# పాదయాత్రగా వచ్చి సత్యదేవునికి మొక్కులు చెల్లించిన దవులూరి



అన్నవరం : తూ.గో.జిల్లా పెద్దాపురం నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి దవులూరి.దొరబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైయస్.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్న కోరిక మేరకు జగన్ ముఖ్యమంత్రి అయిన సందర్భంగా దవులూరి పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మ గుడి వద్ద నుండి పాదయాత్రగా రత్నగిరి కి కార్యకర్తలతో ఆదివారం చేరుకుని సత్యదేవుని తొలిపావాంచ వద్ద నుండి మెట్ల మార్గం ద్వారా సత్యదేవుని సన్నిధికి చేరుకుని మొక్కును చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు శెట్టిబత్తుల.కుమార్ రాజా, కొండపల్లి. అప్పారావు, దడాల. సతీష్, బలువు. రాంబాబు, గుల్లా.దాసు,బొబ్బిలి. వెంకన్న, తాటి పాక. కృష్ణ, ఆర్లె. సూరి బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దవులూరి.దొరబాబు మాట్లాడుతూ జగన్ నాయకత్వంలో సామాన్య ప్రజలకు అన్ని విధములుగా న్యాయం చేకూరుతుందన్నారు. జగన్ ప్రవేశ పెట్టిన నవరత్నాలు ప్రతీ ఒక్కరికి అందుతాయని తెలిపారు.

# సాగులో ఉన్న ఫారెస్ట్, బంజరు భూములకు పట్టాలు మంజూరు చేయాలి





దేవరాపల్లి : ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న ప్రభుత్వ బంజరు ఫారెస్ట్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ కార్య క్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ రాజు మాట్లాడుతూ గిరిజనులు పూర్వకాలం నుండి ఎన్నో ఏళ్ల తరబడి ప్రభుత్వ బంజరు , ఫారెస్ట్ భూములు సాగు చేసుకుంటూ ఆ భూముల్లో జీడి మామిడి తోటలు ఇతర పంటలు కొని అనుభవిస్తున్న నేటికీ ఈ గిరిజనులకు పట్టాలు మంజూరు కాలేదు పట్టాలు లేకపోవడం వలన ప్రభుత్వం పెట్టినటువంటి సంక్షేమ పథకాలు, గాని స్కీములు గాని , రైతు భరోసా వర్తించడం లేదు గతంలో ప్రభుత్వం ఏడు విడతలుగా పట్టాలు మంజూరు చేసి ఉన్నారు అప్పట్లో ఇచ్చినటువంటి పట్టాదార్ పాస్ పుస్తకం లు ఆన్లైన్ కాలేదు సంబంధిత రెవెన్యూ అధికారులు మొత్తం పెట్టినటువంటి మీ ఇంటికి మీ భూమి , జన్మభూమి మొదలగు కార్యక్రమాలలో ఎన్నోమార్లు వ్యక్తిగత దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఏ ఒక్క గిరిజన రైతుకు న్యాయం జరగలేదు అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారి వెంటనే అందించి గూగుల్ లో ఉన్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని అలాగే పట్టాలు కలి గిన గిరిజనులకు ఆన్లైన్ చేయాలని సిపిఎం పార్టీ తరుపున వారు డిమాండ్ చేశారు. లేకుంటే దఫ దఫాలుగా ఆందోళన ఉద్రిక్తం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొట్ల దేవుడు జి.దేవుడు, జన్ని కొండబాబు, సోముల దాసు, తది తరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ నాయకులపై పిల్లలకు అవగాహన అవసరం

**వ్యాసరచన పోటీలు నిర్వహించిన శాఖా గ్రంథాలయం అధికారి ఎన్.రాజబాబు**



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి రాజబాబు

నర్సీపట్నం : విద్యార్థులకు జాతీయ నాయకుల పట్ల వారి జీవన శైలి పట్ల వారు అనుసరించిన విధానాల పట్ల అవగాహన ఉండడం ఎంతైనా అవసరం అని నర్సీపట్నం శాఖ గ్రంథాలయాధికారి ఎన్ రాజబాబు తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని సుమారు 70 మంది విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు గాంధీ జయంతి రోజున బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ,వేములపూడి మోడల్ స్కూల్, ఆదిత్య స్కూల్, నారాయణ ,చైతన్య పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వ్యాసరచన పోటీలు సెలవులు అయినప్పటికీ ఉత్సాహంగా పాల్గొనడం పై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పరీక్షల్లో నేటి యువత ఖాళీలు ఉన్నప్పటికీ అర్హత సాధించకపోవడం శోచనీయం అన్నారు. చరవాణి లపై సమయం వెచ్చించడం కంటే శాఖా గ్రంథాలయంలో పఠనం చేయడం మంచిదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు అవసరమైన పోటీపరీక్షలకు ఉపయోగపడే ఎన్నో విలువైన పుస్తకాలు తమ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

# స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వండి

**- జివియంసి స్పందనకు 182 ఫిర్యాదులు - అదనపు కమిషనర్ ఏ.వి.రమణి**



విశాఖపట్నం : స్పందనలో నమోదైన ఫిర్యాదు దారులను సందర్శించి ఎన్ని రోజులలో పరిష్కరిస్తారన్నది తెలియజేయాలని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. అదేవిధంగా ఫిర్యాదు పరిష్కారం అయిన తరువాత ఆ విషయాన్ని ఫిర్యాదు దారుకు తెలియజేయడంతో బాటు స్పందన రిజిష్టర్‌లో నమోదు చేయాలని వివరించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మొత్తం 182 ఫిర్యాదులు అందాయి. జివియంసి అదనపు కమిషనర్ ఏ.వి.రమణి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 96, ఒకటవ జోన్‌కు సంబంధించి 14, నాలుగవ జోన్‌కు సంబంధించి 15, ఐదవ జోన్‌కు సంబం ధించి 48, ఆరవ జోన్‌కు సంబంధించి 9 ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబం ధించి 19, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 11, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 47, హార్టికల్చర్ విభాగానికి సంబంధించి 5, అదనపు కమిషనర్-1 విభాగానికి సంబంధించి మూడు, డైరక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ విభాగానికి సంబంధించి ఒకటి, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 27, యుసిడి విభాగానికి సంబంధించి 14, ఇతరులకు సంబంధించి 55 పిర్యాదులు అందాయి.

# పోర్టు ట్రస్టు, కార్గో హ్యాండ్లింగ్ డివిజన్ పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లు నవంబర్ 15వ తేదీలోగా సమర్పించవలెను

విశాఖసిటీ : విశాఖపట్నం పోర్టు ట్రస్టు, కార్గో హ్యాండ్లింగ్ డివిజన్ పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లు అక్టోబర్ 1వతేదీ నుండి 2019 మంగళవారం నుండి నవంబర్ 15వతేదీ వరకు (పబ్లిక్ సెలవులు తప్పా) కార్మిక జ్యోగి భవనం పెన్షన్ సెక్షన్ ఎకౌంట్స్ డిపార్టుమెంట్ పోర్టు ఏరియా విశాఖపట్నం, కార్గో హ్యాడ్లింగ్ పెన్షనర్స్ ట్రాఫిక్ డిపార్టుమెంట్ బిడ్లింగ్ గ్రౌండ్‌ఫ్లోరు పోర్టు ఏరియా నందు గల పెన్షన్ సెక్షన్‌నకు తెచ్చి స్వయంగా సమర్పించవలసినదిగా కోరడమైనది. లేదా సంతకం చేసి నిర్ణీత వ్యక్తిచే ధృవీకరింపబడిన లైఫ్ సర్టిఫికెట్‌ను రిజిస్టర్ పోస్టు ద్వారా పెన్షన్, కార్గో హ్యాండ్లింగ్ సెక్షన్‌కు సమర్పించవచ్చును. నవంబర్15వతేదీ లోగా లైఫ్ సర్టిఫికెట్‌లు ఇవ్వని ఎడల నవంబర్ నెల నుండి పెన్షన్ నిలిపివేయబడును.

పెన్షన్ లైఫ్ సర్టిఫికెట్లు యిచ్చుటకు వచ్చినప్పుడు తప్పనిసరిగా పెన్షన్ పుస్తకము తీసుకుని రావలెను. ఇంకనూ ఏమైనా సందేహములు వున్న ఎడల కళింగనగర్, మాధవధార పెన్షనర్స్ వెల్ఫేర్ ఆఫీసుకు వచ్చి సంప్రదించవలెను.

# సచివాలయ భవనాలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ శివశంకర్



నర్సీపట్నం/ నక్కపల్లి: సచివాలయం భవనాలు ఉండాల్సిన తీరును అక్కడ ఉన్న సామాగ్రిని ఇతర సౌకర్యాలను జిల్లా జాయింట్ కలెక్టర్ పేరు తోలేటి శివ శంకర్ పరిశీలన చేశారు.. సోమవారం పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం లోని కొన్ని భవనాలను ఆయన పరిశీలన చేశారు .శాసనసభ్యులు గొల్ల బాబూరావు తో పాటు మండల పార్టీ నాయకులు రామక్రిష్ణ కలిసి భవనాలను పరిశీలించారు .అక్టోబర్ రెండో తేదీన సచివాలయ ఉద్యోగులు సచివాలయ భవనం కి వచ్చివీదుల్లో చేరుతారని దీనికి సంబంధించిన ఏర్పాట్లుసమీక్షిస్తతున్నామని ఆయన విలేకరులకు తెలిపారు.

## ఉమాపార్వతీ దేవి అలంకరణలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



అన్నవరం: తూ.గో.జిల్లా స్దానిక అన్నవరంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు సోమవారం ఉమాపార్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనము ఇచ్చారు. అమ్మవారిని భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.

## వార్డు సచివాలయం ప్రారంభోత్సవానికి స్థలం పరిశీలించిన అధికారులు, నాయకులు



విశాఖపట్నం: అక్టోబర్ 2 నుండి ప్రారంభించనున్న సచివాలయ వ్యవస్థ లో భాగంగా వార్డు సచివాలయం విశాఖ నగరం వరకు ఉత్తర నియోజకవర్గ లోని మొదట గా 38 వార్డు లో గల ఏ ఎస్ ఆర్ నగర్ లో ప్రారంభించి సమీపంలో గల పాలిటెక్నిక్ కాలేజ్ ఆవరణలో సమావేశం నిర్వహించుటకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం అందుకు స్థలాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు తో పాటు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కన్నబాబురాజు సమక్షంలో

# టిడిపి నుండి వైసిపిలోకి చేరికలు



అచ్యుతాపురం : యలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) సమక్షంలో సోమవారం వైసిపి జిల్లా అదికార ప్రతినిధి పిన్నంరాజు వాసు ఆద్వర్యంలో ఉప్పవరం పంచాయితీ టీడీపికి చెందిన పలువురు వైసిపిలోకి చేరారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు .ఈ కార్యక్రమంలో పిన్నంరాజు చిరంజీవి రాజు ,రవీంద్ర రాజు , చిన్ని సత్తిబాబు ,గంగిరెడ్డి నాగేశ్వరరావు ,చందక శివ , పార్టీలో చేరినవారిలో కండి పల్లి శ్రీనివాసురావు ,ఆడప మహాలక్ష్మి నాయుడు ,చందక అప్పలరాజు ,కర్రి రాజు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు ప్రవేశం ఉచితం



విశాఖపట్నం: మహా విశాఖ నగరంలో క్రికెట్ అభిమానులకు ఐదు రోజుల పండుగ రానున్నది భారత్ దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరగనున్న ఈ టెస్ట్ మ్యాచ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సోమవారం ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి ఆరో తారీకు వరకు జరగనున్నా ఈ టెస్ట్ మ్యాచ్ కు టికెట్లు అన్లైన్ ద్వారా అమ్మకాలు చేపడుతున్నామని అలాగే స్కూలు మరియు కాలేజీ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఈ టెస్టు మ్యాచ్ కి సర్వం సిద్ధం చేశామని తెలియజేశారు. బందోబస్తు, భారీ వాహనాల దారి మళ్లింపు పకడ్బందీగా ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ వినయ్ చంద్, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సృజన, పోలీస్ కమిషనర్ ఆర్ కె మీనా, ఏసీఏ నూతన ప్రెసిడెంట్ సరే చంద్ర రెడ్డి, కార్యదర్శి దుర్గా ప్రసాద్, ఏసీఏ-వీడీసీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పథకాలలో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలి



అచ్యుతాపురం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించి అమలు చేయాలని శ్రీ స్వామి వివేకానంద వికలాంగుల అసోషియేషన్ అద్యక్షులు మేరుగు నూకారాజు కోరారు. సోమవారం ఆయన సభ్యులతో కలిసి స్పందన కార్యక్రమంలో వికలాంగుల సమస్యలపై ఎంపీడీఓ , తహశీల్దార్ లకు వినతిపత్రం అందజేశారు .వికలాంగుల కోటాలో సబ్సిడీ లోనులు ,ఇల్లు స్థలాలను ఇవ్వాలని, స్థానిక పరిశ్రమలలో ఉపాధి కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మేరుగు సన్యాసిరావు ,యజ్జల ఎర్రయ్య ,వి తాతరావు తదితరులు ఉన్నా రు.

# వాలంటీర్లకు జీతాలు చెల్లించాలి



అనకాపల్లి: నూతనంగా నియమించిన గ్రామ వాలంటీర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని, సర్వేజన ఐక్యవేదిక వ్యవస్దాపకులు కోరిబిల్లి పరి డిమాండ్ చేసారు. 45 రోజులుగా వాలంటీర్లకు జీతాలు చెల్లించలేదన్నారు. జీతాలు రాక ఆయా కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. వెంటనే స్దానిక శాసన సభ్యుల గుడివాడ అమర్‌నాథ్, స్దానిక పార్లమెంట్ సభ్యురాలు కాండ్రేగుల సత్యవతి జోక్యం చేసుకుని, పండుగను దృష్టిలో పెట్టుకుని వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, కోరిబిల్లి పరి విజ్ఞప్తి చేసారు.

# కార్మికుల 9 నెలల జీతాలు చెల్లించాలి




అనకాపల్లి: విశాఖజిల్లాలో గ్రామ పంచాయితీలో పనిచేస్తున్న పర్మినెంట్ కాంట్రాక్ట్ కార్మికుల 9 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేసారు. స్దానిక ఆర్డీవోకు సంఘం గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆద్వర్యంలో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేసారు. ఈసంధర్భంగా దర్నా నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులు జీతాలు లేక అర్దఆకలితో బ్రతుకుతున్నారన్నారు. వారికి ఇవ్వవలసిన సబ్బులు జోళ్లు మెనూ ఇవ్వడంలేదన్నారు. భద్రత పరికరాలు అందజేయడం లేదన్నారు. యూనిఫారం ఇచ్చి చాలా రోజులైందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 18000 వేల రూపాయలు వేతనం అమలు చేసి, చెల్లించాల్సిన నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని, కోరారు. లేని పక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. దర్నాలు డివిజన్ పరిధిలోని కార్మికులు రవికుమార్, పారిపల్లి విజయ, రాము, లక్ష్మి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

# అప్పుడు మేమలా.. ఇప్పుడిలానా?: కన్నా



అమరావతి: తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తమను వైసీపీ మౌత్ పీస్ అని చంద్రబాబు అన్నారని, ఇప్పుడు జగన్ పాలనలోని లోపాలను ఎత్తి చూపితే టీడీపీ మౌత్ పీస్ అంటున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. విధానాలను తప్పుబడితే ఎదురుదాడి చేయడం సరికాదని ఆయన హితవు పలికారు.

అమరావతి రాజధానిగా అధికార వికేంద్రీకరణ జరగాలని, కర్నూలులోనే హైకోర్టును ఏర్పాటు చేయాలని కన్నా అన్నారు. గాంధీజయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఇసుక కొరతతో లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారని, అక్టోబర్ 7న కార్మికులతో కలిసి భిక్షాటన చేస్తామని ప్రకటించారు. అక్టోబర్ 11న పోలవరాన్ని సందర్శిస్తామని అన్నారు. ఇసుక కొరతకు నేటికీ పరిష్కారం చూపలేకపోయారని కన్నా విమర్శించారు.

# మామిడిపాలెంలో స్టోన్ క్రషర్ నిర్మాణం ఆపాలి

అనకాపల్లి: మండలంలో మామిడిపాలెం గ్రామంలో సర్వే నెంబరు 114, 115 లో నిర్మిస్తున్న స్టోన్ క్రషర్ నిర్మాణ పనులను వెంటనే ఆపాలని, గ్రామానికి చెందిన పలువురు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు స్దానిక ఆర్డీవోకు వినతిపత్రం అందజేసారు. ఈసందర్భంగా ఎం. అప్పారావు, ఎం. నూకరాజులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 100 ఎకరాలకు నీరు అందించే చెరువును ఆనుకుని అతిపెద్ద స్టోన్ క్రషర్ నిర్మిస్తున్నారన్నారు. దీనివలన పశువులు స్దానిక ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. గతంలో ఉన్న క్రషర్లవలన ప్రజలు అనేక రకాల ఆరోగ్యాలతో బాదపడుతున్నారని ఈ స్టోన్ క్రషర్ నిర్మాణం కూడా పూర్తి అయితే దుమ్ము, దూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. వెంటనే స్టోన్ క్రషర్ పనులు నిలుపుదల చేయాలని కోరారు. స్దానిక తహశీల్దార్ మైన్స్ ఏడి, ఎండీవో, పొల్యుషన్ కంట్రోల్ అధికారులకు సంబందిత వినతిపత్రం అందజేసారు.

## బస్సు ప్రమాదంలో ఐదుగురి మృతి

అహ్మదాబాద్ : గుజరాత్‌లో 50 మంది ప్రయాణికులతో వెళుతున్న బస్ బనస్కాంత జిల్లా అంబాజీ పట్టణం వద్ద బోల్తా పడింది. త్రిశూలియా ఘాట్ వద్ద వేగంగా దూసుకుచ్చిన లగ్జరీ బస్సు బోల్తా పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మంది ప్రయాణీకులున్నారు. ఘటనపై సమాచారం అందగానే 108 బ ృందంతో పాటు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. బస్సులో చిక్కుకున్న వారిని స్థానికుల సహకారంతో పోలీసులు వెలుపలికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్‌కు పాక్ ఆహ్వానం

ఇస్లామాబాద్: ఇమ్రాన్ ఖాన్ నేత ృత్వంలోని పాకిస్థాన్ ప్రభుత్వం మరోసారి వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి భారత ప్రధాని నరేంద్రమోదీని కాదని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఆహ్వానం పంపాలని నిర్ణయించింది. కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మన్మోహన్ సింగ్‌ను ఆహ్వానించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పాక్ విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషీ తాజాగా వెల్లడించారు. 'కర్తార్‌పూర్ కారిడార్ ఓపెనింగ్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇది పాక్‌కు ఎంతో ప్రతిష్టాత్మకం. సుదీర్ఘ చర్చ, సంప్రదింపుల తర్వాత మాజీ భారత ప్రధాని మన్మోహన్‌ను ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పిలువాలని నిర్ణయించుకున్నాం' అని ఖురేషీ వివరించారు. ఈ విషయంలో అధికారికంగా ఆహ్వాన పత్రిక కూడా అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్‌కు మత విశ్వాసం ఉంది. ఆయనకు పాక్‌లో ఎంతో గౌరవం ఉంది. అందుకే మేము అతన్ని ఆహ్వానించబోతున్నామని మంత్రి వివరించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండగా నవంబర్ 9, 2019న కారిడార్‌ను ప్రారంభించాలని ఇరుదేశాలు నిర్దేశించుకున్నాయి. పాక్ ఆహ్వానాన్ని మన్మోహన్ సింగ్ తిరస్కరించే అవకాశముందని కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

సిక్కుల గురువైన గురు నానక్ 550వ జయంతి ఉత్సవాలు నవంబర్‌లో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహెబ్ గురుద్వారా, పంజాబ్ గురుదాస్‌పూర్ జిల్లాలోని డేరా బాబా నానక్ గురుద్వారాలను కలుపుతూ ప్రత్యేక కారిడార్‌ను భారత్,పాక్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

# ద్విచక్ర వాహన అమ్మకాల్లో వరుణ్ బజాజ్ హవా

- ఈ ఆర్థిక సంవత్సరంలో 37% మార్కెట్ వాటాలో వరుణ్ బజాజ్ అగ్రగామి
- వరుణ్ బజాజ్ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆఫర్ల వెల్లువ
- వాహనదారులకు నమ్మకమైన సేవలే 'వరుణ్' విజయరహస్యం
- కస్టమర్లకు కృతజ్ఞతలు తెలియజేసిన వరుణ్ బజాజ్ సీఈవో ఆడారి శ్రీనివాస్





విశాఖపట్నం (బిజినెస్ డెస్క్) : ఆటో మొబైల్ ఇండస్ట్రీలో బజాజ్ కంపెనీ యొక్క విశిష్టత అమోఘమైనది. బజాజ్ కంపెనీయొక్క ద్విచక్ర వాహనాల అమ్మకాల్లో విశాఖపట్నంలోనే వరుణ్ బజాజ్ ప్రథమ స్థానంలో నిలిచిందనడంలో సందేహం లేదు. వాహనదారులకు నాణ్యమైన సేవలను అందించడంలో వరుణ్ గ్రూప్ ఎప్పుడూ ముందంజలో ఉంటుంది.

వరుణ్‌బజాజ్ 27వ వార్షికోత్సవ సంబరాలు మరియు దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని వరుణ్ బజాజ్ ప్రవేశపెట్టిన పలు ఆకర్షణీయమైన ఆఫర్లను గురించి వరుణ్ బజాజ్ సీఈఓ ఆడారి శ్రీనివాస్ తెలియజేశారు. బజాజ్ ద్విచక్ర వాహనాల అమ్మకాల్లో వరుణ్ గ్రూప్ ప్రథమ స్థానంలో నిలవటంపట్ల యాజమాన్య సహాయ సహకారాలు, సిబ్బంది విధి నిర్వహణ, అంకితభావమే ముఖ్యమైనదని తెలియజేశారు. గడచిన ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ఆషాఢం, మూఢం కారణంగా ఆటో మొబైల్ రంగం వాణిజ్యంలో తగ్గుముఖం పడుతుండగా బజాజ్ అమ్మకాలు మాత్రం ఒక్క శాతం కూడా తగ్గకపోవడమే ఇందుకు ఉదాహరణ అని శ్రీనివాస్ తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు వరకు 37 శాతం మార్కెట్ వాటాలో విశాఖలో వరుణ్ బజాజ్ అగ్రస్థానంలో నిలిచిందని తెలియజేశారు. ఈ నెలలో సంస్థ యొక్క వార్షికోత్సవం దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని వాహన ప్రేమికులకు ప్రత్యేక ఆఫర్లను సంస్థ అందిస్తోందని తెలిపారు. బజాజ్ ప్రవేశపెట్టిన ప్లాటినం 100 సీసీ హెచ్-గేర్, సీటీ-100/110 సీసీ మరియు పల్సర్ నియాన్ 125 సీసీ మోడళ్లకు విశేష స్పందన లభించడంతో ఇంతటి ఘన విజయం సాధించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. వరుణ్ బజాజ్ విశాఖలో ప్రారంభించి ఈ నెల 5వ తేదీ నాటికి 27 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మరియు కోస్తా ఆంధ్రాకు సెంటిమెంట్ పండగ అయిన దసరా, దీపావళి సందర్భంగా బజాజ్ మోడళ్లపై రూ. 7,200/- వరకు క్యాష్ డిస్కౌంట్ ఆఫర్ మరియు 5 సంవత్సరాల వారెంటీతోపాటు 5 ఉచిత సర్వీసులు మరియు బ్రాండెడ్ కంపెనీ ఐఎస్ఐ మార్కు గల హెల్మెట్‌ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. వినియోగదారుల సౌకర్యార్థమై ఈ ఆఫర్లు అక్టోబర్ 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. అలాగే అతి తక్కువ డౌన్ పేమెంట్‌తో ఫైనాన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అలాగే, మీ పాత టూ వీలర్ ( ఏ మోడల్, ఏ కంపెనీ అయినా) ఎక్ఛ్సేంజిలో తీసుకున్న వారికి మార్కెట్ ధర కంటే రూ. 4,000/- వరకు అదనంగా ఎక్ఛ్సేంజ్ బోనస్‌తో పాటు 5 సంవత్సరాల ఇన్సూరెన్స్ కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. దేవీ నవరాత్రులలో భాగంగా 9 రోజులకు గాను ప్రతీ రోజూ లక్కీ డ్రాలు నిర్వహిస్తూ గెలుపొందిన విజేతలకు 9 రోజులూ 9 స్మార్ట్ టీవీలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ బజాజ్ బైక్ కొనుగోలుపై స్పాట్ ఎక్ఛ్సేంజ్, స్పాట్ ఫైనాన్స్, స్పాట్ డెలివరీ చేసేందుకు తమ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈ పండగల ప్రత్యేక ఆఫర్లు విశాఖ మహానగరంతో పాటు విశాఖ రూరల్‌లో ఉన్న అన్ని వరుణ్ బజాజ్ షోరూంలలో లభిస్తాయని తెలియజేశారు. వరుణ్ బజాజ్ 27 వసంతాల విజయోత్సవ సంబరాలు జరుపుకొనుటలో ఇంతటి విజయానికి కారకులైన కస్టమర్లకు, శ్రేయోభిలాషులకు తమ సంస్థ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వరుణ్ బజాజ్ సీఈఓ ఆడారి శ్రీనివాస్ తెలియజేశారు.






## విశాఖ శ్రీ శారదాపీఠంలో శ్రీ శారదా మాత
## 2వ రోజు - మాహేశ్వరి అమ్మవారిగా దర్శనం



విశాఖ సిటీః శ్రీ శారదాపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు మరియు ఉత్తరపీఠాధిపతి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివారి ఆశీస్సులతో సోమవారం 2వ రోజు కూడా విశాఖ శ్రీ శారదాపీఠ ప్రాంగణంలో గల శ్రీ శారదా స్వరూప రాజశ్యామలా శరన్నవరాత్రి మహూత్సవాలు గురువందనంతో ప్రారంభమైనవి. ముందుగా గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచన కార్యక్రమాలను పూజ్య స్వామివారు ప్రారంభించారు. మండపారాధనాది కార్యక్రమాలు కూడా శాస్త్రోక్తంగా పండితులు నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారు శ్రీ శారదా స్వరూప రాజశ్యామలా అమ్మవారికి విశేషాభిషేకం నిర్వహించారు. సోమవారం ఉదయం చండీహూమం, శ్రీచక్రార్చన అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ శారదా స్వరూప రాజాశ్యామలా అమ్మవారు శ్రీ మాహేశ్వరి అమ్మవారిగా భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం వందలాది మంది మహిళలు కుంకుమ పూజలలో పాల్గొన్నారు. అనంతరం పూజ్యస్వామివారు అమ్మవారికి ఏకదశ హారతులు ఇచ్చారు. కార్యక్రమాలలో పెందుర్తి శాసనసభ్యులు అన్నం రెడ్డి అదిప్‌రాజ్ దపంపతులు మరియు ముమ్మన దేముడు తదితరులు పాల్గొన్నారు. అలాగే అశేషంగా తరలి వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ శారదా స్వరూప రాజశ్యామలా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 5వ తేదీన మూల నక్షత్రం సందర్భముగా ఉదయం 8 గంటలకు సామూహిక అక్షారభ్యాసములు మరియు విద్యార్థిని విద్యార్థులచే సరస్వతీ పూజ నిర్వహించబడును.



## శ్రీ కనక మహా లక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవములు




బురుజుపేటః విశాఖ నగరంలో గల శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవములలో భాగంగా సోమవారం ఉదయం శ్రీ అమ్మవారు ధాన్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ అమ్మవారికి లక్ష చామంతులతో పూజ జరిగినది. అనంతరం శ్రీచక్ర నవవర్ణార్చన జరిగినది. ఈ అలంకరణ దాతలు చెల్ల అప్పలనరసింహం సీతారాం, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకొన్నారు. మంగళవారం శ్రీ ధైర్యలక్ష్మీ అలంకారములో అమ్మవారు దర్శనమిచ్చేదరు. అలాగే అమ్మవారి లడ్డూల పూజ నిర్వహింపబడును. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపకమీషనర్ కార్యనిర్వాహణాధికారి ఎన్.వి.ఎస్.ఎన్. మూర్తి, ధర్మకర్త బి. సత్యరూపవాణి, పర్యవేక్షకులు ఎన్.వి.వి.ఎస్.ఎస్.ఏ.ఎన్. రాజు, పి. శ్రీనివాస్, ఏ. త్రిమూర్తులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. శ్రీ దేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఉ.. 9.00 గం.ల నుండి సాయంత్రం 5.00 గం.ల వరకు రోజుకొక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చేదరు, ఈ సమయంలో భక్తులకు గర్భాలయ ప్రవేశం లేదు. భక్తులు గమనించి సహకరించమనవి. యదావిధిగా ఉదయం 5.00 గం.లకు పంచామృతాభిషేకం, ప్రతి శుక్రవారం జరుగు క్షీరభిషేక సేవ ఉదయం 7.00 గం.ల నుండి 8.00 గం.ల వరకు మరియు సాయంత్రం 6.00 గం.లకు పంచామృతాభిషేకం నిర్వహించబడును. ఉదయం 8.00 గం.ల నుండి 9.00 గం..లవరకు శరన్నవరాత్రులలో శ్రీ అమ్మవారి అలంకరణ చేయు సమయమునందు దర్శనములు నిలిపివేయబడును. ఈ విషయాన్ని యావన్మంది భక్తులు గ్రహించి సహకరించప్రార్థన.

**సాంస్కృతిక కార్యక్రమము:** సాయంత్రం గం. 6.30 ని.లకు డా. బి. విజయ జ్యోతి, నిర్మలా నృత్యనికేతన్, విశాఖపట్నం వారిచే కూచిపూడి నృత్యం భక్తులను ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమములో భాగంగా జి.కె.వి. కాంక్షిత కె.ఎస్. సంధ్యా, విశాఖపట్నంచే క్లాసికల్ కర్నాటిక్ సంగీతం నిర్వహించబడును.

## విజయవాడ ఈఎస్ఐ డైరెక్టరేట్‌లో సోదాలు

విజయవాడ: విజయవాడ ఈఎస్ఐ డైరెక్టరేట్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత సోదాలు జరుపుతున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా ఈఎస్ఐలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే కొన్ని విలువైన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అవకతవకలపై ఈఎస్ఐ డైరెక్టరేట్‌లో ఈఎస్ఐ అధికారులను విజిలెన్స్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు వచ్చి.. పత్రాలను పరిశీలిస్తున్నారని ఏపీ ఈఎస్ఐ డైరెక్టర్ డాక్టర్ సామ్రాజ్యం తెలిపారు. అవినీతి జరిగిందా లేదా అనేది వారి విచారణలో తేలుతుందన్నారు. గతంలో ఈఎస్ఐలో అవకతవకలు జరిగాయని గుర్తించి జాయింట్ కలెక్టర్ మాధవిలత ఇద్దరిని సస్పెండ్ చేశారని తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఉదయలక్ష్మి డ్రగ్స్, టెలీ హెల్త్, పర్చేజస్ డిపార్ట్‌మెంట్లను వెరిఫికేషన్ చేశారని చెప్పారు.

## విశాఖ టెస్టుకు సర్వం సిద్ధం

విశాఖపట్నం: భారత్-దక్షిణాఫ్రికాల మధ్య మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ బుధవారం నుంచి విశాఖలో ప్రారంభంకానుంది. నగరంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగబోయే తొలి టెస్ట్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) నూతన అధ్యక్షుడు శరత్ చంద్రా రెడ్డి, కార్యదర్శి దుర్గారావు, కోశాధికారి గోపీనాథ్ రెడ్డి, తదితరులు స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్టేడియం సిబ్బందికి ఏసీఏ అధ్యక్షుడు శరత్ చంద్రా రెడ్డి సూచించారు.

ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. దీంతో మధ్యాహ్నం వరకు ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యారు. వర్షం ఆగిపోయాక మధ్యాహ్నం నుంచి టీమిండియా ఆటగాళ్లు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. రెండు గంటలకు పైగా సాగిన ప్రాక్టీస్ సెషన్‌లో సారథి విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, హనుమ విహారి, మయాంక్ అగర్వాల్, రవీంద్ర జడేజాలు చెమట చిందించారు.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com